PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 348 | విజయవాడ, ఆదివారం 21 జులై 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 21 July 2024 | Rs

అగ్నివీర్ పరీక్షలోనూ అక్రమాలు

- తక్కువ మార్కులొస్తే పాస్...ఎక్కువొస్తే ఫెయిల్
- కటాఫ్ కంటే తక్కువొచ్చినా ఎంపిక
- పరస్పర విరుద్ధ ప్రకటనలతో గందరగోళం

6



6

గెలిస్తే సెమీస్ బెర్త్

ఆసియాకప్ మహిళల క్రికెట్‌లో నేడు యుఎఇతో ఢీ

భారీగా ఐఎఎస్‌ల బదిలీ

- సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎమ్‌డిగా గిరీషా
- ఎపిసిపిడిసిఎల్ ఎమ్‌డిగా రవిసుభాష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐఎఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1288ను శనివారం విడుదల చేసింది. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల తర్వాత 62 మంది ఐఎఎస్‌ల బదిలీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వీరిలో కొందరిని కమిషనర్లుగా, జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది. మైనార్టీ సంక్షేమశాఖ కమిషనరుగా సిహెచ్ శ్రీదత్‌ను నియమించింది. ఆయనకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఐజి, కమిషనరుగా ఎంవి శేషగిరి, హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్‌శాఖ కమిషనరుగా రేఖారాణి, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరుగా చేవూరి హరికిరణ్ నియమితులయ్యారు. ఆయనకు నేషనల్ హెల్త్ మిషన్ ఎమ్‌డిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సెర్ప్ సిఇఒగా వీరపాండియన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎం హరినారాయణ, బిసి సంక్షేమశాఖ డైరెక్టరుగా మల్లికార్జునను నియమించారు. బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ కమిషనరుగా అదనపు బాధ్యతలు కూడా అప్పజెప్పారు. సాంఘిక, సంక్షేమశాఖ కార్యదర్శిగా ప్రసన్న వెంకటేష్, భూ సర్వేసెటిల్‌మెంట్ డైరెక్టరుగా శ్రీకేష్ బాలాజీరావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎమ్‌డిగా గిరీషా, ఎపి మార్క్‌ఫెడ్ ఎమ్‌డిగా మంజీర్ జిలాని, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టరుగా కృతికా శుక్లాను నియమించారు. ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డిగా రవి సుభాష్, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డిగా లక్ష్మీశా, ఎన్‌టిఆర్ వైద్యసేవ సిఇఒగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డైరెక్టరుగా ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డిగా పి రాజబాబు, ఎక్సైజ్‌శాఖ ప్రొహిబిషన్ డైరెక్టరుగా నిషాంత్‌కుమార్, క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్ మిషన్ ఎమ్‌డిగా జెసి కిషోర్‌కుమార్, అగ్రికల్చర్ మార్కెట్‌శాఖ డైరెక్టరుగా విజయ సునీత, ఉద్యానశాఖ డైరెక్టరుగా కె శ్రీనివాసులు, సాంఘిక, సంక్షేమశాఖ డైరెక్టరుగా లావణ్య వేణి, ఎపిఐఐసి ఎమ్‌డిగా అభిషిక్త్ కిషోర్, ఎపి టిడిసి ఎమ్‌డిగానూ అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సెకండరీ హెల్త్ డైరెక్టరుగా ఎ.సిరి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనరుగా రామసుందర్‌రెడ్డి, ఎపి ట్రాన్స్‌కో జాయింట్ ఎమ్‌డిగా కీర్తి చేకూరి, స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎమ్‌డిగా గణేష్‌కుమార్‌ను నియమించారు. ఆయనకు టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరుగా అదనపు బాధ్యతలు కేటాయించారు. విశాఖ మున్సిపల్ కమిషనరుగా సంపత్‌కుమార్, గుంటూరు మున్సిపల్ కమిషనరుగా దినేష్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనరుగా ధ్యానచంద్ర, తిరుపతి మున్సిపల్ కమిషనరుగా నారపురెడ్డి మౌర్య, కడప మున్సిపల్ కమిషనరుగా ఎన్ తేజ్ భరత్, రాజమండ్రి మున్సిపల్ కమిషనరుగా కేతన్ గార్గ్, పల్నాడు జిల్లా జెసిగా సూరజ్ ధనుంజయ్, గుంటూరు జెసిగా అమిలినేని భార్గవతేజ, తూర్పుగోదావరి జిల్లా జెసిగా హిమాన్షు కోహ్లి, అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసిగా నిశాంతి, కాకినాడ జిల్లా జెసిగా గోవిందరావు నియమితులయ్యారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంటుశాఖ డైరెక్టరుగా విఆర్‌కె తేజ మైలవరపును నియమించారు.



యుపిఎస్‌సి ఛైర్మెన్ మనోజ్ సోనీ రాజీనామా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ఛైర్మెన్ మనోజ్ సోనీ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే తప్పుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ రాజీనామాను తామింకా అంగీకరించలేదని సిబ్బంది శిక్షణా వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. మనోజ్ సోనీ రాజీనామాకు కారణమేమిటన్నది ఇదమిత్థంగా తెలియరాలేదు. 2029 వరకు సోనీ ఆ పదవిలో కొనసాగాల్సి ఉన్నప్పటికీ, ఇంతలోనే తప్పుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 2017 నుంచి యుపిఎస్‌సిలో సోనీ సభ్యుడిగా ఉన్నారు. 2023 మే 16న యుపిఎస్‌సి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. సోనీ రాజీనామాకు, ట్రైనీ ఐఎఎస్ పూజా ఖేద్కర్ వివాదంతో ఎలాంటి సంబంధం లేదని అధికారులు చెబుతున్నారు. సోనీ యుపిఎస్‌సి బాధ్యతలు చేపట్టడానికి ముందు మూడుసార్లు వైస్ ఛాన్సలర్‌గా పని చేశారు. డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో రెండు సార్లు, బరోడాలోని మహారాజా సయ్యాజిరావు యూనివర్సిటీకి ఒకసారి వైస్ ఛాన్సలర్‌గా చేశారు.

జనావాసాలపై ఇజ్రాయిల్ దాడులు

- ధ్వంసమైన భవనాలు..
- 37 మంది మృతి

లోపలి పేజీల్లో...

రూ. 7 కోట్ల హెరాయిన్ స్వాధీనం

- రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు సరఫరా

స్తంభించిన జనజీవనం

- పొంగుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- కంటిమీద కునుకులేకుండా పోలవరం విలీన గ్రామాల ప్రజలు
- ఇప్పటికే పలువురు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయిన వైనం

ప్రజాశక్తి- యంత్రాంగం

భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు పొంగుతున్నాయి. అనేక చోట్ల రోడ్లకు గండ్లు పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం విలీన ప్రాంతాల్లో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అల్లూరి జిల్లా చింతూరు వద్ద శబరి నది 22 అడుగులకు చేరింది. చింతూరు మండలంలోని సోకిలేరు, చీకటి వాగు, చంద్రవంక వాగు, కొయ్యూరు వాగులు పొంగడంతో సుమారు 70 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొయగురు వాగు వరద ధాటికి 362 నెంబరు రహదారి కోతకు గురైంది. దీంతో, ఆంధ్రా-ఒడిశాల మధ్య రవాణా స్తంభించింది. రాజవొమ్మంగి, మారేడుమిల్లి, ఎటపాక, జికె.వీధి మండలాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

గుట్టలపై తాత్కాలిక నివాసాలు

అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం గోదావరి పరివాహక గ్రామాలైన తుమ్మిలేరు పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాలు, శ్రీరామగిరి పంచాయతీలోని నాలుగు గ్రామాల ప్రజలు ముంపు భయంతో ఇప్పటికే గుట్టలపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తక్షణమే బరకాలు, సోలార్ లైట్లు, మంచినీరు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, కిరోసిన్ ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఒడ్డుగూడెం గ్రామస్తులు మైదాన ప్రాంతమైన రేఖపల్లికి సామాన్లతో వెళ్లిపోయారు.

గర్భిణులు, వ్యాధిగ్రస్తుల బాధలు వర్ణనాతీతం

అల్లూరి జిల్లా జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కోరపల్లి గ్రామానికి చెందిన కొర్ర లక్ష్మి శనివారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆశా కార్యకర్త సహకారంతో ఆస్పత్రికి బయలుదేరారు. డి.అగ్రహారం వద్ద వాగు కల్వర్టుపై మిగతా 2లో



అల్లూరి జిల్లా చింతూరు మండలం కల్లేరు - కొయుగురు మధ్య కొట్టుకుపోయిన రహదారి

వర్ష ప్రభావిత, ముంపు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు

రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మూడు రోజులుగా శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా వరకూ కురుస్తున్న భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో వెంటనే యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి వేలేరుపాడు మండలం మొత్తం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు తెలంగాణా రాష్ట్రంలో అశ్వారావుపేట మండలంలో ఉందని, ప్రాజెక్టు ఆయకట్టు గ్రామాలు ఎపిలోని వేలేరుపాడు మండలంలో ఉన్నాయని తెలిపారు. ఈ రెండు రాష్ట్రాలను గత ఐదేళ్లుగా పాలించిన ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే పెద్దవాగుకు గండిపడిందని తెలిపారు. ఉభయ రాష్ట్రాల ఉమ్మడి అంశాల ఆస్తుల విషయంలో జరిగిన తాత్సారమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. 15 గ్రామాల్లో జనావాసాలు నేలమట్టమయ్యాయని, మిగతా 2లో

నిధులు... పథకాలు

- వీటి సాధనే ముఖ్యం
- టిడిపి ఎంపీలతో చంద్రబాబు



టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి అవసరమైన నిధులను, పథకాలను సాధించడమే లక్ష్యంగా పార్లమెంటు సమావేశాల్లో వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ ఎంపిలకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూచించారు. టిడిపి పార్లమెంటరీ సమావేశం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న హామీలు అమలు జరిగేలా చూడాలని, షెడ్యూల్ 9, 10లో ఉన్న ఆస్తుల పంపకాలను పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అమరావతి, పోలవరం, జల్‌జీవన్ మిషన్ వంటి ప్రాజెక్టుల కోసం నిధులు రాబట్టాలని చెప్పారు. పెట్రోలియం యూనివర్సిటీకి అవసరమైన నిధులు తీసుకురావాలన్నారు. కడప ఉక్కుపై కేంద్రంతో చర్చలు జరపాలన్నారు. విజయనగరంలో ఉన్న మెగ్నీషియం గనులను రాష్ట్రానికి కేటాయించాలని ప్రసంగాల్లో ప్రస్తావించాలని చెప్పారు. రాజధాని అమరావతితో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు తేవాలని, మైక్రో ఇరిగేషన్‌కు 90శాతం సబ్సిడీతో పాటు, పారిశ్రామిక రాయితీలను కేంద్రం నుంచి సాధించాలని చెప్పారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే ప్రాజెక్టు భూసేకరణపై కేంద్రంతో మాట్లాడి ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. జాతీయ రహదారులపై దృష్టి సారించాలని, అమరావతి-అనంతపురం, రాజధాని ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.

ఉనికి కోసం జగన్ తప్పుడుప్రచారం

మాజీ సిఎం జగన్ తన ఉనికి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. వినుకొండలో వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యకు కూడా రాజకీయ రంగు వేస్తున్నారని అన్నారు. అతని బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరయ్యేందుకే ఢిల్లీలో ధర్నా అంటున్నారని, దానిని పట్టించుకోనవసరం లేదని ఎంపిలకు చంద్రబాబు సూచించారు. వైసిపి ప్రభుత్వం, జగన్ చేసిన పనులు చూస్తుంటే తీవ్రవాదులు, ఉగ్రవాదులు కాస్త బెటరేమో అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. టిడిపి నాయకులందరిపైనా జగన్ కేసులు పెట్టారని, అందర్నీ జైలుకు పంపారని, అయినా, కక్ష తీర్చుకునే పద్ధతులు వద్దని అన్నారు. దాడులకు పాల్పడితే ఎవరినైనా వదిలేది లేదని చెప్పారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, పార్లమెంటరీ నేత లావు కృష్ణదేవరాయులు, మంత్రులు, ఎంపిలు పాల్గొన్నారు.



వైసిపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

దాడులపై ఎలుగెత్తండి

- పార్లమెంటు ద్వారా బాబుకు గట్టి హెచ్చరికలు
- వైసిపి ఎంపిలకు జగన్ దిశా నిర్దేశం
- ఢిల్లీ ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి కార్యకర్తలు, నాయకులపై రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న దాడులకు నిరసనగా పార్లమెంటు సమావేశాల్లో ఎలుగెత్తాలని ఆ పార్టీ ఎంపిలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో వైసిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లాలని, గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏమి జరుగుతుందో జాతీయస్థాయిలో అందరికీ వివరించాలని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఇక వైసిపికి మాత్రమే సంబంధించినవి కావని, ప్రజాస్వామ్య మనుగడకే పెద్ద దెబ్బ అని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని చెప్పారు. రాష్ట్రంలో తక్షణం రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పార్లమెంటులో గట్టిగా నినదించాలని, పార్లమెంటు ద్వారా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలని ఎంపిలకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా తాము ఈ విషయమై నిరసన తెలపడంతో పాటు, ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూ 24వ తేదీన ఢిల్లీలో మిగతా 2లో

కేంద్రాలవారీగా నీట్ ఫలితాలు

న్యూఢిల్లీ : నీట్ యుజి 2024 పరీక్షా ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కేంద్రాల వారీగా శనివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను అధికార వెబ్‌సైట్ లేదా నీట్ డాట్ ఎన్‌టిఎ ఆన్‌లైన్ డాట్ ఇన్‌లో చూసుకోవచ్చు. జులై 20వ తేదీ మధ్యాహ్నం 12గంటల కల్లా నీట్ ఫలితాలను పరీక్షా కేంద్రాల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈ నెల 18న సుప్రీంకోర్టు ఎన్‌టిఎను ఆదేశించిన సంగతి తెలిసిందే. విద్యార్థుల గుర్తింపులను వెల్లడించకుండా వారి మార్కులను పేర్కొనాలని కోర్టు పేర్కొంది. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి గురువారం సిబిఐ పాట్నా ఎయిమ్స్‌కి చెందిన నలుగురు వైద్య విద్యార్థులను అరెస్టు చేసింది. దీనిపై ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ కృష్ణ పాల్ మాట్లాడుతూ, విద్యార్థులు దోషులని తేలితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్దయెత్తున అవకతవకలు చోటు చేసుకున్నట్లు వార్తలొచ్చాయి. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. గ్రేస్ మార్కులను రద్దు చేసి, ఆ విద్యార్థులకు జూన్ 23న తిరిగి పరీక్ష నిర్వహించారు.

బాలిక హత్య కేసు నిందితుడు అనుమానాస్పద మృతి

లాకప్‌డెత్‌గా అనుమానాలు

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసు నిందితుడు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తమ నుంచి తప్పించుకొనే క్రమంలో ఆయాసానికి గురై మరణించాడని పోలీసులు చెప్తున్నారు. పోలీసులు కొట్టడం వల్లే చనిపోయాడని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితులైన ముగ్గురు మైనర్ బాలురుల్లో ఒక బాలుని మేనమామ హుస్సేన్ (35) అలియాస్ యోహాన్‌ను విచారణ నిమిత్తం శుక్రవారం నంద్యాల సిసిఎస్ పోలీసులు తీసుకెళ్లారు. శనివారం ఉదయం ఆయన మృతి చెందాడు. నందికొట్కూరు పట్టణంలో గౌండ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. హుస్సేన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పోలీసులు తరలించారు. ఆస్పత్రి వద్ద పహారా ఏర్పాటు చేసి మృతదేహాన్ని చూసేందుకు బయట వ్యక్తులను ఎవరినీ అనుమతించడం లేదు. హుస్సేన్ మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణ పేరుతో పోలీసులు తీవ్రంగా హింసించారని, వారు కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక లాకప్‌లోనే మృతి చెందాడని వారు ఆరోపిస్తున్నారు.



హుస్సేన్

విచారణ కోసం తీసుకెళ్తున్న సమయంలో మృతి : ఎస్‌పి

విచారణ కోసం తీసుకెళ్తున్న సమయంలో నిందితుడు హుస్సేన్ మృతి చెందినట్లు నంద్యాల జిల్లా ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముచ్చుమర్రిలో అదుపులోకి తీసుకొని విచారణ కోసం నందికొట్కూరుకి వెళుతుండగా మార్గమధ్యలో పోలీస్ జీపులోనుండి దూకి పారిపోయే ప్రయత్నం చేశాడని తెలిపారు. పోలీసులు అతడిని పట్టుకున్నారని, ఆయాసంతో ఎద నొప్పి ఉందని అతను తెలపడంతో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించారని ఎస్‌పి తెలిపారు.



విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ

- మిలిటరీ మోహరింపు
- కొనసాగుతున్న ఆందోళనలు
- 115కి పెరిగిన మృతులు

ఢాకా : బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కొత్త రిజర్వేషన్ కోటాలను విధించడానికి నిరసనగా విద్యార్థులు గత కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చడంతో దేశ వ్యాపితంగా కర్ఫ్యూ విధించారు. సైన్యాన్ని రప్పించారు. బహిరంగ సభలు, సమావేశాలపై నిషేధాలు వున్నప్పటికీ విద్యార్థులు భద్రతా బలగాలతో ముఖాముఖి తలపడుతున్నారు. పోలీస్ కాల్పుల్లో ఇంతవరకు 115 మంది విద్యార్థులు చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. ఇంటర్‌నెట్, టెక్స్ మిగతా 5లో

బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం

- అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్
- సోషల్ మీడియాలో అశ్లీలతను నిరోధించాలన్న వక్తలు
- ఘటనలపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సూచన



చర్చా గోష్టిలో మాట్లాడుతున్న డి రమాదేవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని, వారికి రక్షణ కల్పించే చట్టాలపై విస్తృత ప్రచారం చేయాలని అత్యాచారాల వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్ చేసింది. శనివారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో వేదిక ఆధ్వర్యాన చర్చాగోష్టి జరిగింది. మహిళ, విద్యార్థి, దళిత, ఆదివాసీ, హక్కుల సంఘాల మేధావులు హాజరయిన ఈ సమావేశంలో అత్యాచారాలను నిరోధించాలని, లైంగిక వ్యాఖ్యానాలు, అసభ్య కథనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలపై మీడియాలో సోషల్ మీడియాలో వికృత వ్యాఖ్యానాలు, కథనాలు సాగుతున్నాయని తెలిపారు. వాటిని అరికట్టాలని, అలాంటి కంటెంట్‌ను పెట్టేవారిపై సుమోటోగా చర్యలు తీసుకోవాలని కోరారు. వందరోజుల్లో మత్తు మందులను అరికడతామని చెప్పిన ప్రభుత్వ ప్రకటన ఇంకా ఆచరణలోకి రాలేదని, కీలకమైన వారిలో ఒక్కరినైనా అరెస్టు చేయలేదని అన్నారు. మద్యం, మత్తు మందులు, మహిళలపై దాడులు అత్యాచారాలు అరికట్టాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా మహిళలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగా భవాని మాట్లాడుతూ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ వారం రోజులుగా మీడియాలో చర్చలు జరుగుతున్నాయని మిగతా 2లో

అడిగోపుల మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు దశాబ్దాలుగా సాహిత్యరంగంలో ఆయన సేవలు మరువరానివని తెలిపారు. కావలి జవహర్ భారతి కళాశాలలో విద్యను అభ్యసించినప్పటి నుంచి చివరి వరకూ ప్రతి సామాజిక సందర్భంలోనూ, సంక్షోభంలోనూ కవిత్వంతో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. వెంకటరత్నం మృతి సాహితీరంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వైసిపి బిల్డింగ్ యథాతథ స్థితిని కొనసాగించండి

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం, లింగంగుట్లలోని వైసిపి కార్యాలయ భవనం విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ బి కృష్ణమోహన్ శనివారం పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ (పుడా)కు ఆదేశాలు జారీ చేశారు. పుడా అధికారులతోపాటు పంచాయతీ అధికారులు కౌంటర్ వేయాలని నోటీసులిచ్చారు. వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న పుడా వైస్ ఛైర్మన్ సాంబశివరావుకు కూడా నోటీసులిచ్చారు. విచారణను 4 వారాలకు వాయిదా వేశారు. వైసిపి బిల్డింగ్ కూల్చివేతకు ఈ నెల 9న జారీ చేసిన కన్ఫర్మేషన్ ఉత్తర్వులను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. నివాసేతర భవనం కనీసం 300 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంటే పంచాయతీ నుంచి అనుమతులు సరిపోతాయని పిటిషనర్ వాదన. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ..పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు తర్వాత నిబంధనలు ఏమిటో తెలియని అమాయకులు పిటిషనర్లు కాదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, పురపాలకశాఖ అధికారులను, పంచాయతీ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ప్రహరీ కూల్చకుండా ఉత్తర్వులివ్వాలని పిల్

భీమునిపట్నం సముద్రతీరం వద్ద ఉన్న తమ ప్రహరీని కూల్చేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) అధికారులిచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి హైకోర్టులో శనివారం అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. జస్టిస్ బొప్పుడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. నోటీసు కూడా ఇవ్వకుండా ప్రహరీ కూల్చివేత చర్యలు మూడు రోజుల్లో చేస్తామని జివిఎంసి తుది ఉత్తర్వులు జారీ చేసిందని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. బీచ్ ఏరియాలో నిర్మాణాలు చట్ట వ్యతిరేకమని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేశారు. ఇదే తరహా అంశంపై పిల్ చీఫ్ జస్టిస్ బెంచ్ వద్ద ఈ నెల 24న విచారణకు వస్తుందని తెలిపారు. ఈ పిటిషన్‌ను పిల్‌తో జత చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. అప్పటి వరకు పిటిషనర్ ప్రహరీని కూల్చరాదని షరతు విధించారు.

ముందస్తు బెయిల్ కోరిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరుపతిలో జరిగిన ఘర్షణలపై ఎస్‌పి క్యాంపస్ పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. శనివారం జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు పెట్టారని పిటిషనర్ న్యాయవాది వెంకటేష్ రెడ్డి చెప్పారు. రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారన్నారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. పోలీసుల నుంచి వివరాల నిమిత్తం విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

చట్టానికి లోబడే మాజీ ఎంపి ఇంటి విషయంలో చర్యలు

బాపట్ల మాజీ ఎంపి నందిగామ సురేష్ ఇంటి విషయంలో చట్టానికి లోబడి అధికారులు పనిచేయాలని జస్టిస్ బి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏ విధమైన చర్యలు తీసుకున్నా పిటిషనర్ వాదన వినాలని చెప్పారు. చట్ట ప్రకారం మాత్రమే వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. నోటీసుల ప్రక్రియ కొనసాగించవచ్చునని అన్నారు. అనుమతులు లేకుండా తదుపరి నిర్మాణాలు చేపట్టరాదని షరతు విధించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారంటూ సురేష్‌కు పంచాయతీ అధికారులు నోటీసులిచ్చారు. దీనిపై నందిగం హైకోర్టును ఆశ్రయించారు.

ఫిర్యాదులపై చర్యలు

- బాధితులకు సిఎం హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాధితుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం శనివారం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు టిడిపి కార్యాలయానికి తరలి వచ్చారు. వారి నుంచి సిఎం నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలు విన్నారు. తన భూమిని వైసిపికి చెందిన తమ బంధువులు ఆక్రమించారని ఆచంట నియోజకవర్గానికి చెందిన పిల్లి పార్వతి ముఖ్యమంత్రికి తన గోడు విన్నవించారు. తాను చనిపోయినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి తనపైనే తిరిగి కేసు పెట్టారని వివరించారు. తన భూమిని తిరిగి ఇప్పించాలని కోరారు. సావధానంగా సమస్యను విన్న చంద్రబాబు తిరిగి స్థలం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా యానిమేటర్లు తమ సంతకాలు ఫోర్జరీ చేసి, రూ.30 లక్షల రుణాలు తీసుకున్నారని చిలకలూరిపేట నియోజకవర్గం తిమ్మాపురానికి చెందిన డ్వాక్రా సభ్యులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులతో కుమ్మక్కై బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై విచారణ చేయిస్తామని సిఎం హామీ ఇచ్చారు. నిందితులపై చర్యలు తీసుకుని సొమ్మును రికవరీ చేయిస్తామని చెప్పారు. సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఆర్ట్స్, క్రాఫ్ట్, పిఇటి, కాంట్రాక్టు టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైం కాంట్రాక్టు, ఇన్‌స్ట్రక్చర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సిహెచ్‌ఎన్ దేవేంద్రరావు.. ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.



అధికారులు అప్రమత్తం

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ అధికారులతో వర్చువల్‌గా శనివారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడితే తక్షణమే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

తుపాకీ మిస్‌ఫైర్‌తో సిఐఎస్‌ఎఫ్ జవాన్ మృతి

- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - అవుకు (నంద్యాల)

తుపాకీ మిస్‌ఫైర్ అయ్యి సిఐఎస్‌ఎఫ్ జవాన్ మృతి చెందారు. నంద్యాల జిల్లా అవుకు మండలం జూనూతల గ్రామానికి చెందిన పెట్నికోట వెంకటేష్ (32) సిఐఎస్‌ఎఫ్‌లో 12 సంవత్సరాల క్రితం చేరారు. ప్రస్తుతం హైదరాబాదులోని సిఐఎస్‌ఎఫ్ (బిడిఎల్,బనూర్,సంగారెడ్డిజిల్లా) బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. తమ బెటాలియన్‌కు చెందిన బస్సులో వెళ్తుండగా అతని వద్ద ఉన్న తుపాకీ మిస్‌ఫైర్ అయి తలలోకి బుల్లెట్లు చొచ్చుకుపోయాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. గతంలో ఆయన ఢిల్లీలోని దేశ ప్రధాని నరేంద్ర మోడీ నివాసం (ప్రధానమంత్రి రక్షణా దళంలో) వద్ద విధులు నిర్వర్తించారు. వెంకటేష్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన స్వగ్రామంలో అధికారిక లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



జవాన్ వెంకటేష్

గుంటూరు మేయర్ నిరసన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు శనివారం తన ఛాంబర్‌లోనే నిరసన వ్యక్తం చేశారు. నల్ల చొక్కాతో కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. తాను ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయనందుకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 20న కౌన్సిల్ సాధారణ సమావేశం జరపాలని ఈ నెల 8వ తేదీనే నిర్ణయించామని, కానీ అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. ఒక మేయర్ కౌన్సిల్ భేటీకి తేదీని ప్రకటించే హక్కు ఉందని తెలిపారు. ఇప్పటి వరకు కార్పొరేటర్లకు, ఎమ్మెల్యేలకు అధికారులు సమాచారం ఇవ్వలేదన్నారు. దీనికి నిరసనగానే తాను నల్ల చొక్కా వేసుకుని మీడియాతో మాట్లాడుతున్నానని తెలిపారు. గుంటూరు ఎంపి, నగర పరిధిలోని ఎమ్మెల్యేలను నూతన ఎక్స్ అఫిషియో సభ్యులుగా పరిగణలోకి తీసుకొని నిబంధనల ప్రకారం సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపినా స్పందించలేదన్నారు. సమావేశం ఎందుకు పెట్టలేదో తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తాను న్యాయపోరాటం చేస్తానని చెప్పారు. తాము వైసిపి నుంచి ఎన్నికైనా కొత్త ప్రభుత్వానికి సహకరిస్తామని, నగర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



నల్ల చొక్కా వేసుకుని మీడియాతో మాట్లాడుతున్న మేయర్ మనోహర్ నాయుడు

విద్యార్థులకు ఇబ్బంది కలిగితే ఊరుకోం : మంత్రి సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసి సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. వర్షాలు పడుతుండటంతో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆమె ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగునీరు, భోజనం, వసతుల విషయంలో పూర్తిస్థాయిలో శ్రద్ధ తీసుకోవాలని, మన ఇంట్లో పిల్లలపై తీసుకునే శ్రద్ధే హాస్టల్ పిల్లల విషయంలోనూ తీసుకోవాలన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో పరిశీలన చేయగా, చాలాచోట్ల వసతులు సరిగాలేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. డయేరియా, డెంగీ లాంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై చాలాచోట్ల ఫిర్యాదులందాయని మంత్రి పేర్కొన్నారు. వసతుల విషయంలో రాజీపడే అధికారులను ఉపేక్షించబోమన్నారు.

స్తంభించిన జనజీవనం



పురిటినొప్పులతో బాధపడుతున్న జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కోరపల్లి గ్రామానికి చెందిన కొర్ర లక్ష్మిని వాగు దాటిస్తున్న ఆశా కార్యకర్త



సురక్షిత ప్రాంతాలకు సామాన్లుతో సహా తరలిపోతున్న అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం గ్రామస్తులు



ఉండ్రాజవరంలో గండిని పూడుస్తున్న అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

నుండి ప్రవహిస్తుండడంతో అంబులెన్స్ రాలేకపోయింది. దీంతో, ఆశా కార్యకర్త, బంధువులు కలిసి ఆమెను నడిపించుకుంటూ వాగు దాటించారు. చింతూరు మండలం కొండపల్లికి చెందిన ఇద్దరు నిండు గర్భిణులను చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య ఆదేశాల మేరకు పడవలను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కూనవరం మండలం కోతులగుట్ట సిహెచ్‌సికి 15 మందిని, చింతూరు హాస్పిటల్‌కి 28 మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాదపుటంచున వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు

ఏలూరు జిల్లాలోని విలీన మండలాల్లో రహదారులు నీట మునిగాయి. దీంతో, దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలు, ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చి పడుతున్న వరద నీటితో గోదావరి ఉధృతి పెరుగుతోంది. దీంతో, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం వద్ద నీటిమట్టం 30.600 మీటర్లకు చేరింది. దీంతో, దిగువకు 5.87 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 35.20 అడుగులకు చేరింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 8.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. 4.09 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 28 మీటర్ల నుంచి 30 మీటర్లకుపైగా నీటిమట్టం చేరింది. దాదాపు ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 40 వేల ఎకరాలకు దెబ్బ

పశ్చిమగోదావరి జిల్లాలో 32,427 ఎకరాల్లో వరి నాట్లు, 2,751 ఎకరాల్లో నారు మడులు దెబ్బతిన్నాయి. 20 మండలాల పరిధిలోని 263 గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. 17,557 మంది రైతులు బాధితులయ్యారు. ఏలూరు జిల్లాలో 4,094 ఎకరాల్లో వరి నాట్లు, 196 ఎకరాల్లో నారు మడులు దెబ్బతిన్నాయి. 146 గ్రామాల పరిధిలో 3,580 మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. శనివారం ఏలూరు జిల్లాలో 98.6 మిల్లిమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 34.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

ముంచెత్తిన ఎర్ర కాలువ

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వర్షాలకు పంటలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉండ్రాజవరం ఎర్ర కాలువ నీరు గట్లు తెంచుకుని చేలను ముంచెత్తింది. అధికారులు గండిని తాత్కాలికంగా పూడ్చి వేశారు. కోటిపల్లి రేవులో పడవ ప్రయాణాలు నిలిపివేశారు. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు కుంగిన ఏటి గట్టును జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పరిశీలించారు. ఏటిగట్టును గ్రావెల్‌తో నింపాలని ఆదేశించారు. నిడదవోలు, నల్లజర్లలో పునరావాస కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. తాళ్లపూడిలో కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. గోపాలపురం మండలంలో సుమారు 11 ఇళ్లు వరద నీటికి ధ్వంసమయ్యాయి. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏలేరు, ఈస్ట్ డెల్టా పరిధిలో కాలువలు పొంగిపొర్లుతున్నాయి. కోటనందూరులో వర్షాలకు నర్సీపట్నం ప్రధాన రహదారిలో భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విశాఖలో 9 విమానాల సర్వీసులు రద్దు

భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే 9 విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్‌కు వెళ్లే ప్రయాణికులు సహకరించాలని కోరారు.

ఒకరు మృతి, మరొకరు గల్లంతు

వేర్వేరు ఘటనల్లో ఒక మహిళ మృతి చెందారు. మరో వ్యక్తి గల్లంతయ్యారు. రంపచోడవరం మండలం మడిచర్ల గ్రామంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంకుటిల్లు కూలి కడబాల లక్ష్మి (43) మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామానికి చెందిన యువకుడు పసుపులేటి వంశీకృష్ణ కొవ్వూరు ఈరేనమ్మరేవు వద్ద గోదావరిలో కాలకృత్యాలకు వెళ్లి కాలుజారి గల్లంతయ్యారు. ఆయన వారం రోజుల్లో ఆస్ట్రేలియాకు ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి


కాకినాడ నగరంలోని కల్పన సెంటర్లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... నగరంలోని వైఎస్‌ఆర్ ఫ్లైఓవర్ నుంచి కల్పనా సెంటర్ మీదుగా అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రెండు బైక్‌లను ఢీకొట్టింది. అనంతరం కారు బోల్తా పడింది. ఆ కారులో మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలం చేరుకుని క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం తాగి కారు నడపమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కానివ్వం : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కానిచ్చేది లేదని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1211వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించిన కర్మాగారంగా స్టీల్‌ప్లాంట్ పేరుగాంచిందన్నారు. అటువంటి పరిశ్రమ ప్రయివేటుపరమైతే లక్షలాది మంది జీవనోపాధికి విఘాతం కలుగుతుందని తెలిపారు. ప్లాంట్‌ను ఉద్దేశపూర్వకంగా సర్వనాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మద్దతు పలకడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయబోమన్న ప్రకటన చేయించాలని కోరారు. దీక్షల్లో సంఘం జోన్ అధ్యక్షులు బి.సింహాచలం, నాయకులు ఎం.ఈశ్వరరావు, ఎస్.శ్రావణ్ కుమార్, ఎస్.రామ్‌గోపాల్, ఎన్.మోహన్‌రావు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి నుంచి నీటి విడుదల



ప్రకాశం బ్యారేజీ నుండి విడుదలవుతున్న నీరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గోదావరి నుంచి వరద నీరు భారీగా వస్తుండడంతో పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. నీటి ప్రవాహం పెరగడంతో శనివారం తొలి విడతగా నాలుగు గేట్లు తెరిచి 7 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం కృష్ణా డెల్టా పరిధిలో కూడా భారీగా వర్షాలు కురుస్తుండటంతో ఎగువ నుంచి వస్తున్న అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఒకవైపు పట్టిసీమ నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కులు వస్తుండగా.. అదనంగా ప్రకాశం బ్యారేజీ ఎగువ నుంచి మున్నేరు, బుడమేరు, పాలేరు తదితర ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తోంది. దీంతో బ్యారేజి వద్ద గరిష్ట నీటి నిల్వ 3.07 టిఎంసిలకు మించి నీరు వస్తుండటంతో అదనంగా వచ్చిన నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నిండితే ఆగస్టు ఒకటో తేదీ కల్లా సాగర్‌కు నీటి ప్రవాహం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

జగన్ బయటకు వస్తే రాష్ట్రానికి నష్టం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రోడ్లపై తిరుగుతున్న ప్రతిక్షణం రాష్ట్రానికి నష్టమేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. వినుకొండలో ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ జరిగితే టిడిపికి ఆపాదించడం సరికాదన్నారు. ఇద్దరూ గతంలో వైసిపిలో అనేక వివాదాల్లో ఉన్నారని, దీనిని రాజకీయ హత్య ఎలా అంటారని ప్రశ్నించారు. మాచర్లలో టిడిపి నాయకులు చంద్రయ్యను వైసిపి నేతలు చంపితే వ్యక్తిగత కక్ష అని కప్పిపుచ్చారన్నారు. ఆనాడు జగన్ మాచర్ల వెళ్లి చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించారా? అని నిలదీశారు. జగన్ గురించి ఢిల్లీలో అవమానకరంగా మాట్లాడుకుంటున్నారని, ఈశాన్య ప్రాంతాల్లో మన రాష్ట్రం గురించి తక్కువ చేసి మాట్లాడుతున్నారని తెలిపారు. అభివృద్ధి అనేది జగన్ అజెండాలో లేదనే విషయం దేశం మొత్తానికి తెలిసిందని విమర్శించారు. అంతకు ముందు ఆయన గుంటూరులో ఆర్‌ఒబిలు, జిజిహెచ్‌లో మౌలిక వసతులపై అధికారులతో సమీక్షించారు. గుంటూరులో రైల్వే, ఆర్‌అండ్‌బికి సంబంధించిన 12 పనులపై డిపిఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను కోరినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నశీర్ అహ్మద్, రామాంజనేయులు, కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్స్ పునరుద్ధరణ

- ముద్దాడ రవిచంద్రకు కెవిపిఎస్ వినతి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్టడీ సర్కిల్స్‌ను పునరుద్ధరించడంతోపాటు డిఎస్‌సికి ఉచిత కోచింగ్ ఇవ్వాలని దళిత, గిరిజన, బలహీన, మైనార్టీ వర్గాల నిరుద్యోగ యువతీ యువకులకు హాస్టల్‌తో కూడిన ఉచిత కోచింగ్ ఇప్పించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సిఎంఒ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లేదా మహాత్మా జ్యోతిబాపూలే స్టడీ సర్కిల్స్ పేరుతో విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, ఏలూరుల్లో సొంత భవనాలు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ప్రైవేటు బిల్డింగ్స్‌లో నడిచేవని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం వీటిని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ పునరుద్ధరణ చేయడంతోపాటు గిరిజనుల కోసం విశాఖ, విజయవాడల్లో స్టడీ సర్కిల్స్‌పెట్టి ఉచిత శిక్షణ ఇవ్వాలని కెవిపిఎస్ విజ్ఞప్తి చేసింది. స్టడీ సెంటర్ల నిర్వహణ కోసం కెవిపిఎస్ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది.

బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఇవి సరైనవి కావని, మీడియా స్వతంత్రంగా వ్యవహరించడమే కాకుండా సంయమనం పాటించాలని కోరారు. సిడబ్ల్యుసి సభ్యులు రాధాకుమారి మాట్లాడుతూ ప్రధానంగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలను గంజాయి వ్యాపారులు సరఫరాదారులుగా మార్చుకుంటున్నారని తెలిపారు. అటువంటి వారి కోసం డి ఎడిక్షన్ సెంటర్లు పెట్టాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ హాస్టళ్లలో మత్తుపదార్థాలు పెద్దఎత్తున అందుబాటులోకి వస్తున్నాయని, వాటిని నియంత్రించాలని కోరారు. డాక్టర్ వెల్లంకి శ్రీదేవి మాట్లాడుతూ అన్ని అశ్లీలతకు మద్యం కారణమని, మద్యం షాపులు తగ్గించాలని కోరారు. ధీర పేరుతో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము మాట్లాడుతూ స్త్రీ పురుషుల సమానత్వం సాధించడం ద్వారానే అత్యాచారాలకు మూల కారణాలను తొలగించొచ్చని పేర్కొన్నారు. చట్టాలను ప్రభుత్వం సరిగా అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ హోమ్‌శాఖ మంత్రి డ్రగ్స్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారని, దానికి తగిన విధంగా చర్యలు లేవని అన్నారు. పవన్ కల్యాణ్‌కు ఆడపిల్లల బాధ ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు.

కీలక తీర్మానాలు

అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక ఆధ్వర్యాన చర్చించిన అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సైబర్ క్రైం విభాగాన్ని, సోషల్ మీడియా, టిడి కార్యక్రమాల్లో కంటెంట్ తనిఖీ చేసి వాటిపై చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. సినిమాల్లో చిత్రీకరిస్తున్న అసభ్యలైంగిక దృశ్యాలను తగు విధంగా సెన్సార్ చేసేందుకు సెన్సార్ బోర్డును పటిష్టం చేయాలని, అశ్లీలతను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలపై లైంగిక వేధింపుల కేసులపై తక్షణమే విచారణ జరిపి, శిక్షలు విధించేందుకు పోలీసు యంత్రాంగాన్ని, ఫోరెన్సిక్ విభాగాన్ని, న్యాయ వ్యవస్థను తగిన విధంగా విస్తరించాలని, ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా సన్నద్ధం చేయాలని కోరారు. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, కుటుంబ హింస కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా ఫాస్ట్‌ట్రాక్ విచారణ చేయించాలన్నారు. విద్యావిధానంలో లైంగిక విద్యను పొందుపరుస్తూ స్త్రీ పురుషుల మధ్య గౌరవం పెరిగే పాఠ్యాంశాల్లో మార్పు తీసుకురావాలని, మంత్రులు, శాసన సభ్యులు మహిళల పట్ల సభ్యతగా వ్యవహరించకపోతే చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు పునరావాసం, నష్టపరిహారం తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్ ఆధ్వర్యాన మానిటరింగ్ కమిటీ వేయాలని, అవగాహన కల్పించేందుకు రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇవ్వాలని కోరారు. సైబర్ క్రైం విభాగాన్ని బలపరిచేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, వాసవ్య మహిళా మండలి నుండి రశ్మి, తరుణి తరంగాల నుండి శారద, వేర్వేరు రంగాల నుండి స్వరూపరాణి, సుమతి, వినయ్, నేతి ఉమామహేశ్వరరావు,మాల్యాద్రి, పద్మ, లక్ష్మి, చింతల శ్రీనివాస్, సంపర శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడులపై ఎలుగెత్తండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని అన్ని పార్టీల నాయకులకు ఆహ్వానం పంపుతామని, కలిసివచ్చే పార్టీలను కలుపుకుపోతామనిచెప్పారు. రాష్ట్రంలో 45 రోజుల టిడిపి కూటమి పాలనలో 36 రాజకీయ హత్యలు, 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయన్నారు. టిడిపి నేతల వేధింపులు భరించలేక మరో 35మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, 560 చోట్ల ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేశారని, పలుచోట్ల ఇళ్లలోకి చొరబడ్డ సంఘటనలు జరిగాయని చెప్పారు. తమ పార్టీకి చెందిన వారి చీనీ తోటలను నరికేస్తున్నారని, 490చోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారని జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. సొంత పార్లమెంటరీ నియోజకవర్గంలోనే ఎంపి మిథున్‌రెడ్డిపై దాడులు చేశారని, మాజీ ఎంపి రెడ్డప్ప వాహనాన్ని దగ్ధం చేశారన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు


(మొదటి పేజీ తరువాయి)

వందలాది పశువులు, మృత్యువాత పడ్డాయని పేర్కొన్నారు. కరెంటు స్తంభాలు పడిపోయి, గ్రామాల మధ్య రహదారులు గండ్లు పడి ఆ మండలం మొత్తానికి ఇతర ప్రాంతాలతో అన్ని సంబంధాలు తెగిపోయాయని తెలిపారు. బాధిత ప్రజలు నిస్సహాయులుగా ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే వారికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, కోనసీమ, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో వాగులు ఏరులు పెద్దఎత్తున ప్రవహిస్తున్న ఫలితంగా గండ్లు పడి వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయని తెలిపారు. గోదావరి, శబరి, సీలేరు నదుల వరద తాకిడితో పరిసరాల్లో ఉన్న వందలాది గ్రామాల్లో మునక భయంతో ప్రజలు మెరక ప్రాంతాలకు వెళ్లాలనే ప్రయత్నంలో ఉన్నారని పేర్కొన్నారు. విలీన మండలాల్లో తక్షణం యుద్ధ ప్రాతిపదికన వరద ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో పర్యటించి పూర్తిస్థాయిలో బాధిత ప్రజలకు రక్షణ, సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ జిల్లాలన్నిటా పార్టీ శ్రేణులు వెంటనే పర్యటనలు చేయాలని, బాధిత ప్రజలకు సహాయక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. వరద నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం నేతృత్వంలో సిపిఎం బృందం ఆదివారం వరద ప్రాంతాల్లో పర్యటించనుందని తెలిపారు.

కట్టుబట్టలే మిగిలాయి

- సర్వం కోల్పోయాం • పంట మునకతో అప్పులపాలయ్యాం • 'పెద్దవాగు' బాధితుల ఆర్తనాదాలు

'కట్టుబట్టలతో మిగిలాం.. కష్టపడి కట్టుకున్న ఇల్లు సర్వనాశనమైంది. వ్యవసాయ మోటార్లు, ఇంజిన్ పైపులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. పశువుల కోసం దాచిన గడ్డివాము కూడా వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. పాడి గేదెలు, ఆవులు ఎక్కడికి వెళ్లాయో తెలియడం లేదు. దాదాపు రూ.4 లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి' అని అల్లూరి నగర్‌కు చెందిన 'పెద్దవాగు' బాధితుడు చిలుకూరి సత్యనారాయణ వాపోయాడు. 'మూడెకరాల్లో పత్తి పొలంలో ఇసుక మేటలు వేసింది. మిరప నారు దెబ్బతింది. సాగుకోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఇంటిదగ్గర పెట్టిన వ్యవసాయ సామగ్రి వరదలకు కొట్టుకుపోయాయి. దాదాపు రూ.ఐదు లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుంది' అని మేడిపల్లి గ్రామానికి చెందిన కొర్రి సుగుణ కన్నీరుమున్నీరైంది. వీరే కాకుండా 15 గ్రామాల ప్రజల ఆర్తనాదాలు మిన్నంటాయి. పెద్దవాగు ప్రాజెక్టుకు పడిన గండి పేద ప్రజలు, రైతులకు పూడ్చలేని నష్టాన్ని మిగిల్చింది. ఉప్పెనలా వచ్చి ఊర్లమీద పడ్డ వరదకు బాధితులు చెట్టుకొకరు... పుట్టకొకరుగా చెల్లాచెదురై ప్రాణాలు కాపాడుకున్నారు.


చిలుకూరి సత్యనారాయణ


కొర్రి సుగుణ


ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పెదవాగు వరద ఉధృతికి అల్లూరి నగర్‌లో ఇళ్లు కొట్టుకుపోగా మిగిలిన శిథిలాలు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు

భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, గుమ్మిడిపల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడడంతో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని దాదాపు 15 గ్రామాల ప్రజలకు కోలుకోలేని దెబ్బ తగలింది. ఇళ్లు, పశువులు, సామగ్రి సర్వం కోల్పోవడంతో ప్రతి కుటుంబానికీ పెద్దయెత్తున ఆస్తి నష్టం సంభవించింది. దాదాపు వెయ్యి కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి. పెద్దవాగు ప్రాజెక్టు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉమ్మడి ప్రాజెక్టుగా గోదావరి బోర్డు పరిధిలో ఉంది. ఇరు రాష్ట్రాలు దీని నిర్వహణను సరిగ్గా పట్టించుకోకపోవడంతో వరదలకు ప్రాజెక్టుకు గండిపడి గ్రామాలను ముంచెత్తింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని మేడిపల్లి, కమ్మరిగూడెం, అల్లూరి నగర్, కోయమాధవరం, ఇప్పలగుంప, రామవరం, పాతపూచర్ల, గుళ్లాయి, ఊటగుంపు, కొత్తపూచర్ల, వసంతవాడ తదితర 15 గ్రామాలను ముంచెత్తింది. రాత్రిపూట గండిపడి వరద నీరు ఒక్కసారిగా ఊళ్లలోకి విరుచుకుపడటంతో జనం మెరక ప్రాంతాలు, డాబాలపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు.

కుటుంబానికి సగటున రూ.4 లక్షలు నష్టం!

వరద బీభత్సానికి పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. పశువులు మృత్యువాత పడ్డాయి. ఇళ్ల వద్ద ఉన్న వ్యవసాయ సామగ్రి కొట్టుకుపోయింది. దీంతో, ప్రతి కుటుంబానికీ రూ.నాలుగు లక్షలకుపైగానే ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ఇళ్లలో పెద్దయెత్తున బురద చేరడంతో శుభ్రం చేసుకోవడానికి బాధిత కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయి. ప్రాజెక్టుకు గండి పడటంతో దాదాపు 50 ఎకరాల్లో నారు మడులు, 200 ఎకరాల్లో వరి నాట్లు, 130 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగాయి. వరద తాకిడికి రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు, భవనాల శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.కోటి 14 లక్షలు ఖర్చవుతుంది. దెబ్బతిన్న గ్రామాల్లో పర్యటించిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు, అధికారుల వద్ద బాధితులు ఘొల్లుమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వరద నీరు తగ్గడంతో బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నారు. భోజనం, తాగునీరు అధికారులు అందిస్తున్నా, జరిగిన నష్టాన్ని చూసి కన్నీరుమున్నీరవుతున్నారు.

ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తమ పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుందని, తమ గ్రామాలను కూడా ముంపు ప్రాంతాలుగా ప్రకటించి సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు కట్టి ఇవ్వాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

శ్రీశైలం, తుంగభద్రకు వరద నీరు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు/హొళగుంద

శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలకు వరద నీరు పోటెత్తింది. ఎగువ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం పెరుగుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి ఐదు గేట్ల ద్వారా 47,424 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 33,733 క్యూసెక్కులు మొత్తం 81,157 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అదే సమయానికి శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.70 అడుగులకు చేరింది. నేటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 36.5568 టిఎంసిలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలలో తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు శ్రీశైలం నుంచి పది టిఎంసిల నీటి విడుదల పూర్తయింది. కొద్ది రోజులుగా ఆంధ్ర పరిధిలోని కుడి గట్టు విద్యుత్తు కేంద్రంలో 4.5 టిఎంసిల నీటిని వినియోగించుకుని విద్యుత్తు ఉత్పత్తి ద్వారా దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేయగా, శనివారం తెలంగాణలోని భూగర్భ జల విద్యుత్తు కేంద్రం ద్వారా 5.5 టిఎంసిల నీటి విడుదల పూర్తి కావడంతో విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్రకు 1,02,745 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. తుంగభద్ర నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలు కాగా ప్రస్తుతం 72 టిఎంసిల నీటి నిల్వ ఉంది. మరో నాలుగు రోజుల్లో గరిష్ట స్థాయి నీటి నిల్వకు చేరుకునే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. తుంగభద్రకు నీటి ప్రవాహం పెరగడంతో డ్యాం, ఎల్‌ఎల్‌సి కాలువలపై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కులు మొదలు పెట్టారు.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో తగ్గుదల

- జూన్ త్రైమాసికంలో 3.24 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన అన్ని రంగాల ఎగుమతులు డీలా పడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 3.24 శాతం పడిపోయి 5.88 బిలియన్ డాలర్ల (రూ.49వేల కోట్లు)కు పరిమితమయ్యాయి. ఎర్ర సముద్ర సంక్షోభం కారణంగా సరుకు రవాణా ఖర్చు పెరగడం, బియ్యం ఎగుమతులపై ఆంక్షలు, విదేశాల్లో మొక్కజొన్నకు ధర తగ్గడం తదితర కారణాల వల్ల ఎగుమతుల్లో తగ్గుదల చోటు చేసుకుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) కింద ఉన్న మాంసం, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తులు, తాజా పండ్లు, కూరగాయల ఎగుమతులు పెరిగాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్రకారం.. గడిచిన తొలి త్రైమాసికంలో బియ్యం ఎగుమతులు స్వల్పంగా 0.46 శాతం తగ్గి 2.82 బిలియన్ డాలర్లు (రూ.23.600 కోట్లు)గా నమోదయ్యాయి. బాస్మతి బియ్యంకు గ్లోబల్ డిమాండ్ ఉండటంతో 2024-25 ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 13 శాతం పెరిగి 1.03 బిలియన్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షల కారణంగా 13 శాతం 1.06 బిలియన్లు (రూ.8874 కోట్లు)గా నమోదయ్యాయి. గత సంవత్సరం, దేశీయ సరఫరాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం తెల్ల, బ్రోకెన్ రైస్ ఎగుమతులపై నిషేధం విధించింది. పార్బాయిల్డ్ రైస్‌పై 20 శాతం రవాణా సుంకాలను విధించింది. గత అక్టోబర్ నుండి బాస్మతి బియ్యం ఎగుమతులపై కనీస ఎగుమతి ధరను టన్నుకు 950 డాలర్లు (రూ.80వేలు)గా నిర్ణయించింది. అంతర్జాతీయ ధరల కారణంగా మొక్కజొన్నతో సహా ఇతర తృణధాన్యాల ఎగుమతులు 76 శాతం తగ్గి 251 మిలియన్లకు పడిపోయాయి. వేరుశెనగ ఎగుమతులు 16 శాతం క్షీణించి 136 మిలియన్లుగా, పప్పు ధాన్యాలు 5 శాతం తగ్గి 143 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆరు నెలల తర్వాత తాము గత సంవత్సరం ఎగుమతులను అధిగమించగలుగుతామని వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రాజేష్ అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

హత్యలు చేసే సంస్కృతి జగన్‌దే

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హత్యలు చేసే సంస్కృతి వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. శనివారం ఉండవల్లిలోని సిఎం నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యలన్నింటినీ కూటమి ప్రభుత్వానికి జగన్ అంటగడుతున్నారన్నారు. పార్టీ మారనందుకు తోట చంద్రయ్యను హత్య చేసిన సంస్కృతి వైసిపిదేనన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదన్నారు. ఎంతోమంది టిడిపి నేతలను జగన్‌మోహన్‌రెడ్డి హత్యలు చేయించారని మంత్రి ఆరోపించారు. ఏ ముఖం పెట్టుకుని ఢిల్లీలో ధర్నా చేస్తారని ప్రశ్నించారు.

జగన్ మాటలను ప్రజలు నమ్మరు : నాగబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మరని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె నాగబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినుకొండలో వ్యక్తిగత కక్షల వల్ల హత్య జరిగితే ఆ సంఘటనకు రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకోవాలని జగన్ చూస్తున్నారని పేర్కొన్నారు. దళితుడైన డ్రైవరు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డెడ్‌బాడీని ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేసినప్పుడు జగన్‌కు చట్టం గుర్తుకు రాలేదా? మాస్కులు కావాలని అడిగిన డాక్టర్ సుధాకర్‌ను పిచ్చి వాడిగా చిత్రీకరించి ఆత్మహత్య చేసుకునేలా చేసినప్పుడు ప్రశ్నించాలనే బుద్ధి రాలేదా? అని ప్రశ్నించారు. శాసనసభకు డుమ్మా కొట్టేందుకే ఢిల్లీలో ధర్నా డ్రామా అని, కూటమి మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చుతామని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో అధికారులు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎడతెరపి లేకుండా పడుతున్న భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు వ్యవసాయ శాఖాధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్‌కు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సూచించారు. మంత్రి ఫోన్ ద్వారా అధికారులకు శనివారం పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తుపాను కారణంగా పంట నష్టం అంచనాలు వేయాలని, జిల్లాల వారీ వర్షపాతం ఎప్పటికప్పుడు నమోదు చేసి అందుకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయాలన్నారు.

మైక్రోసాఫ్ట్ దెబ్బకు ఇండిగోకు భారీ నష్టం

న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్‌లో అంతరాయం చౌక ధరల విమానయాన సంస్థ ఇండిగోకు భారీ నష్టాలను మిగిల్చింది. శుక్రవారం ఒక్క రోజే దాదాపు 200 విమాన సేవలను రద్దు చేసింది. మైక్రోసాఫ్ట్ ఔటేజ్ ఎఫెక్ట్‌తో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు దాదాపు రూ.5300 కోట్ల నష్టం వాటిల్లింది. శుక్రవారం ఇండిగో షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.

ముఖ్యమంత్రి కార్యదర్శులకు శాఖల కేటాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యదర్శులకు శాఖలు కేటాయిస్తూ సిఎంఒ ఆదేశాలిచ్చింది. సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్రకు సాధారణ పరిపాలన, న్యాయ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, హోమ్, ప్రకృతి విపత్తులు, ఫైనాన్స్, ప్లానింగు, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాలు, రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపులు, ఎక్సైజ్, దేవాదాయ శాఖలు అప్పగించారు. వాటితోపాటు న్యాయ, ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమం, సిఎంఒ కార్యాలయ నిర్వహణ, విదేశీ, ఢిల్లీ పర్యటనలతోపాటు మొత్తం సమన్వయ బాధ్యతలు, కేటాయించిన ఇతర శాఖలను అప్పగించారు. కార్యదర్శి ఎ.వి.రాజమౌళికి జలవనరులు, గనులు, విద్యుత్, వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థక, డెయిరీ డెవలప్‌మెంట్, ఫిషరీస్ విభాగాలు కేటాయించారు. అలాగే సాంఘిక సంక్షేమ, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, మైనార్టీ సంక్షేమం అప్పగించారు. వీటితోపాటు బిసి, ఇడబ్ల్యుఎస్, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కేటాయించారు. పిఎస్ ప్రద్యుమ్నకు మానవ వనరులు, ఆర్‌టిజి, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, పర్యావరణ, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలు అప్పగించారు. వీటితోపాటు ఆర్అండ్‌బి, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, హౌసింగ్, మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం, సెర్ప్, యువజన వ్యవహారాలు, స్పోర్ట్స్ అప్పగించారు. కార్తికేయ మిశ్రాకు ఐటి ఇసి, ఎన్ఆర్ఐ, ఐఅండ్‌పిఆర్, టూరిజం, కల్చర్, సినిమాటోగ్రఫీ, సదుపాయాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్, కార్మిక, ఫ్యాక్టరీ, బాయిలర్స్, ఎంఎస్ఎంఇ, ముఖ్యమంత్రి ఢిల్లీ, విదేశీ పర్యటనలు అప్పగించారు.

ఆర్టికల్ 356పై జగన్‌కు తెలిసింది శూన్యం

- టిడిపి నేత వర్ల రామయ్య విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టికల్ 356 గురించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసింది శూన్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని కలిసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరతామనడం పట్ల రాజ్యాంగంపై ఏమాత్రం అవగాహన లేదని అర్థమైందని పేర్కొన్నారు. ఈ మేరకు వైఎస్ జగన్‌కు వర్ల రామయ్య శనివారం లేఖ రాశారు. ఇద్దరు కార్యకర్తల వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో జరిగిన హత్యను శవ రాజకీయాలకు తెరలేపడం సరికాదన్నారు. జగన్ పాలనలో 300 మంది బిసిలు, 192 మంది ఎస్‌సిలు, 58 మంది ఎస్‌టిలు, 11 మంది మైనార్టీలు, 2027 మంది మహిళల హత్యలు జరిగాయని వివరించారు.

రూ.7 కోట్ల హెరాయిన్ స్వాధీనం : నలుగురు అరెస్టు

- రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు సరఫరా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజస్థాన్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్ముతున్న నలుగురు నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు రూ.ఏడు కోట్ల విలువ చేసే హెరాయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి అవినాష్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు. మాదాపూర్ పోలీసులు, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు, నార్కోటిక్ బ్యూరో అధికారులు శనివారం ఉదయం శిల్పారామం వద్ద స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు హెరాయిన్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరందరూ రాజస్థాన్‌కి చెందిన వారుగా గుర్తించారు. శిల్పారామం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నేమిచంద్ భాటీ, అజయ్ భాటీ, నర్పత్ సింగ్, హరీష్ సిర్వీని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పావుకిలో చొప్పున నాలుగు ప్యాకెట్ల హెరాయిన్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నేమిచంద్ భాటీకి హెరాయిన్ అందించిన సంతోష్ ఆచారి ప్రస్తుతం జోద్‌పూర్ జైలులో ఉండగా, అతన్ని పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి విచారిస్తామని సిపి తెలిపారు. నిందితులు హైదరాబాద్‌లో ఎవరికి డ్రగ్స్ విక్రయించాలని చూస్తున్నారో వారిని కూడా కస్టడీలోకి తీసుకుని విచారిస్తామన్నారు. పట్టుబడ్డ నర్పత్ సింగ్‌పై గతంలో రాజస్థాన్‌లో ఎన్‌డిపిఎస్ కేసులు ఉన్నాయని, మిగితా నిందితుల నేర చరిత్రపైనా విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

సంపాదకీయం

మనిషితనం మొలకెత్తాలి!

'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు/...అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి/ చుట్టూ తిరుగుతున్నాడమ్మా' అంటాడో కవి. పతనం అంచున ఊగిసలాడుతున్న మానవ సంబంధాల పట్ల కవి ఆవేదన ఇది. మనిషితనం మరచిపోయిన మనిషి ప్రవర్తన పట్ల ఒకింత జుగుప్స కలగక మానదు. ఒక మనిషి మరో మనిషిపై, ఒక జాతి మరో జాతిపై ఆధిపత్యం చెలాయించాలనుకోవడం, దానికోసం ఎంతకైనా తెగించడం మాయమవుతున్న మనిషితనానికి నిదర్శనం. మనిషన్నవాడు- చెయ్యరాని చెడ్డా లేదు, చెయ్యలేని మంచీ లేదు. పాల్పడరాని స్వార్థమూ లేదు, సాధించలేని పరార్థమూ లేదు. దిగరాని నైచ్యమూ లేదు, అందుకోలేని ఉచ్ఛ స్థితీ లేదు. చెయ్యరాని నాశమూ లేదు, చెయ్యలేని నిర్మాణమూ లేదు. అందుకే అంటాడు పానుగంటి- 'మనుష్యుడంత మాయకాడు మరియొకడున్నాడా? ముందునకు వాడే నడచును. ఆ కాళ్లతోనే వెనుకకునూ వాడే నడచును' అని. మానవత్వం మంట కలిసిన ప్రతి చోటా... డబ్బు చుట్టే మనిషి జీవితం తిరుగుతుంటుంది. ఆ మనిషిని వెనుకుండి తిప్పే అతీత శక్తి ప్రపంచీకరణ. మనిషి తనను తాను మర్చిపోయి, స్వార్థంలో కూరుకుపోయి, నేను అనే స్వార్థపరతత్వంతో కూడిన వ్యవస్థను నిర్మిస్తున్నది ఈ మట్టికాళ్ల మహారాక్షసి ప్రపంచీకరణే.

'ఓ రిటైర్డ్ టీచర్...తన పూర్వ విద్యార్థి పెళ్లికి వెళతాడు. ఆడంబరంగా జరుగుతున్న ఆ పెళ్లి ఆవరణలోకి అనుమతి లభించదు. నేను పెళ్లికొడుకు మాస్టార్‌ని అని చెప్పినా ఎవరూ నమ్మరు. మీరూ... మీ వేషం....మీరు టీచరేంటి? పొండి పొండి... అంటారు. వెనక్కి వెళ్లిన మాస్టారు...ఈసారి తెల్లని బట్టలు కట్టుకొని, శుభలేఖ పట్టుకొని మళ్లీ వస్తారు. మాస్టార్‌ని చూసిన పెళ్లికొడుకు...రండి మాస్టారూ...అంటూ ఆహ్వానిస్తాడు. అరే అబ్బాయ్...ఇదిగో నువ్విచ్చిన శుభలేఖ. మనిషిని మనిషిగా గౌరవించని చోట క్షణం కూడా వుండలేను. వేష భాషలకిచ్చే గౌరవం తోటి మనిషికి ఇవ్వలేనప్పుడు, నువ్వు ఎంత ఎదిగినా దానికి విలువ వుండదు... గుర్తుంచుకో' అని వెళ్ళిపోతారు. ఇలాంటి సంఘటనలు తరచూ వింటూ వుంటాం. 'ఇక్కడొక మనిషుండాలి/ కలల విత్తనాలుండాలి/ ఆనందాల మొలకలుండాలి/ తోటి మానవునికి చేయూతనిచ్చే చేయుండాలి/ బతుకుదారిలో కన్నీళ్లను తుడిచే చూపుడు వేలుండాలి/ ఇక్కడొక మనిషుండాలి/ ఏడీ ఏమయ్యాడు?' అంటూ మనుషులు... మనుషులు కాకుండా పోతున్న వైనాన్ని చెప్తాడో కవి. అయితే, తాజాగా జరిగిన ఈ ఘటనలు మనిషితనాన్ని మరోసారి నగ్నంగా నడివీధిలో నిలబెడతాయి. 'ధోతీ ధరించారన్న కారణంతో ఓ అన్నదాతకు అవమానం జరిగింది. ఓ తండ్రీ, కుమారులు సినిమా చూసేందుకు బెంగళూరులోని జీటీ మాల్‌లోకి వెళ్తుండగా అక్కడి భద్రతా సిబ్బంది ఆ రైతుని అడ్డగించారు. ఆ రైతు ధోతీ ధరించడమే కారణమని, ప్యాంట్ ధరించి వస్తే లోపలికి అనుమతిస్తామని సిబ్బంది తెలిపారు. ఇటీవల బెంగళూరులోని రాజాజీనగర్ మెట్రో స్టేషన్‌లోనూ ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. మురికిగా వున్న బట్టలతో వున్నాడని ఓ రైతుని మెట్రో రైలు ఎక్కేందుకు అనుమతి నిరాకరించాడు అక్కడి సెక్యూరిటీ సూపర్‌వైజర్. తోటి ప్రయాణీకులు కొందరు కలుగజేసుకొని, ఆ రైతుకు మద్దతుగా నిరసన తెలిపేవరకూ వెళ్లింది.

తలకిందులవుతున్న సమాజ పోకడల్నీ, ధ్వంసమౌతున్న మానవ విలువల్నీ, మానవ సంబంధాల్నీ అంటుకట్టి బతికించుకోవాలి. ఎడారుల్లా, ఒంటరి ద్వీపాల్లా మిగిలిపోయే సంక్లిష్ట సమయాల్లోంచి, సంక్షుభిత సందర్భాల్లోంచి, సంకుచిత స్వభావాల్లోంచి మనిషి అలికిడి, మానవతా విలువలు మొలకెత్తాలి. 'మనిషే నా కేంద్రం/ మనిషే నా సిద్ధాంతం/ అచ్చం మనిషిలానే జీవిస్తాను/ చివరకు మనిషిలానే మరణిస్తాను' అంటూ మనిషితనాన్ని, మనిషి పట్ల మనిషికి వుండాల్సిన మానవతా బంధాన్ని కవిత్వీకరిస్తాడు కవి చిత్తలూరి. మనిషిలోని మానవత్వం గడ్డకట్టిందంటే.. జరగరానిదేదో జరిగినట్లు... మనిషి చుట్టూ పద్మవ్యూహం పన్నిన ప్రపంచీకరణే మాట్లాడుతున్నట్లు. అనేకానేక మాస్కులు తొడుక్కున్న కార్పొరేట్ సంస్కృతి మధ్య మానవ ముఖం సరికొత్తగా పుట్టుకురావాలి. 'పాపాత్ముడు, పుణ్యాత్ముడు రాల్చే కన్నీళ్లకు తేడాలేదు. ప్రేమపూరిత హృదయం రక్తాశ్రువుల్ని రాలుస్తుంది' అంటాడు కబీరు. 'తనను అవమానించిన వ్యక్తిని ఉద్యోగంలోంచి తీసేయొద్దు...అతనికీ ఓ కుటుంబం వుంది' అంటూ మనిషితనాన్ని చాటుకున్న ఆ రైతు హృదయం ప్రతి మనిషిలోనూ మొలకెత్తాలి. మానవ విలువల్ని పాదుకొల్పాలి.

మహనీయుల మాట




ఆలోచనలు తుపాకులు కంటే శక్తిమంతమైనవి. శత్రువులు మన దగ్గర తుపాకులను వుండనివ్వరు.

- జోసెఫ్ స్టాలిన్



ఇ.సి తీరు మారాలి

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటింగు, లెక్కింపులకు సంబంధించి సందేహాలు వున్న అభ్యర్థులకు ఇవిఎంలను పరీక్షించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ఎన్నికల సంఘం (ఇ.సి) నోటిఫికేషన్ విడుదల చేసింది. సంబంధిత అభ్యర్థులు తాము కోరుకున్న ఏ పోలింగ్ కేంద్రంలోనైనా మాక్ పోలింగ్, వి.వి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు కోరవచ్చునని ప్రకటన చేసింది. అయితే జూన్ నాలుగున ఫలితాలు వెలువడిన వారం రోజులలోగా అభ్యంతరాలు నమోదు చేసిన వారికి మాత్రమే ఆ అవకాశం వుంటుంది. దేశంలో ఎనిమిది మంది అభ్యర్థుల నుంచి అలాంటి అభ్యంతరాలు ఇ.సి కి అందాయి. వాటిలో కాంగ్రెస్, బిజెడి, వైసిపి అభ్యర్థులతో పాటు బిజెపి వారు కూడా వుండటం విశేషం. విజయనగరంలోని బొబ్బిలి నుంచి వైసిపి, చత్తీస్‌గఢ్ లోని కాంకర్‌లో, హర్యానా లోని కర్నాల్, ఫరీదాబాద్‌ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఈ దరఖాస్తులు చేశారు. ఆసక్తికరంగా మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణలలో లోక్‌సభ స్థానాలపై బిజెపి అభ్యర్థులు వెరిఫికేషన్ కోరారు. శాసనసభ పోలింగ్‌కు సంబంధించి ఎ.పి లో రెండు చోట్ల వైసిపి, ఒరిస్సాలో ఒకచోట బిజెడి పరిశీలన కోరాయి. ఓటింగుపై సందేహాలు, ఇవిఎంల లోని మైక్రో చిప్‌లను పరీక్షించు కోవచ్చని, ఒక్కో ఇవిఎంను పరీక్షించుకోవడానికి నలభై వేల రూపాయలు డిపాజిట్ కట్టవలసి వుంటుందని ఇసి తెలిపింది. ఈ ఎనిమిది మంది అభ్యర్థులు మొత్తం 43 పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేసుకున్నారు. జూన్ 16వ తేదీన ఇ.సి ఒక బహిరంగ ప్రకటన విడుదల చేస్తూ వారు ఎక్కడైనా ఏ ఇవిఎంనైనా పరీక్షించుకొనేందుకు అవకాశం కల్పించడానికి సిద్ధంగా వున్నట్టు వెల్లడించింది. ఇవిఎంల పనితీరుపై అపోహలకు వాటి సాంకేతికతకన్నా ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరే ఎక్కువ ఆస్కారమిస్తోంది.


ఇవిఎంలపై అభ్యంతరాలను, అనుమానాలను తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు ప్రధాన పోలింగ్ కంటే ముందుగా ఏప్రిల్ 26న తీర్పునిచ్చింది. ఎలాంటి సందేహాలకు ఆధారం లేదని అభిప్రాయపడింది. మహారాష్ట్రలో శివసేన (షిండే) వర్గం అభ్యర్థి నైరుతి ముంబాయి నుంచి కేవలం అయిదు ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. అలా గెలిచిన ఆ అభ్యర్థి బావమరిది ఒక కౌంటింగ్ అధికారి ఫోన్‌లో మాట్లాడటం వివాదమైంది. ఫోన్ తీసుకుపోవడం, అధికారి ఫోన్‌లో ఇతరులు మాట్లాడటం నిషిద్ధం గనక కేసు పెట్టారు గాని మరేమీ తప్పు జరగలేదని ఎన్నికల సంఘం ఆగమేఘాల మీద సమర్థించుకుంది. అయితే ఈ క్రమంలో ఓట్ల గోల్‌మాల్ జరిగిందనేది రాహుల్ గాంధీ ఆరోపణ. ఇక్కడ ఇవిఎంలు హ్యాకింగ్ అయ్యాయని కాదు, మానవ పరమైన తగు జాగ్రత్తలు ఇ.సి తీసుకోకపోవడం వల్లే ఇటువంటి అనుమానాలకు ఆస్కారమిస్తోంది. వి.వి ప్యాట్‌లను జత చేయాలని 2013లో సుబ్రహ్మణ్య స్వామి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. న్యాయంగా స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే పేపర్ వినియోగంతో పోల్చిచూడటం (పేపర్ ట్రయల్) తప్పనిసరి అని అభిప్రాయపడింది. సాధ్యమైనన్ని ఎక్కువ చోట్ల వి.వి. ప్యాట్ వెరిఫికేషన్ ఏర్పాట్లు జరగాలని 2019లో తీర్పు చెప్పింది. తాను నిర్ణయించిన అయిదు శాతం పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే వివి ప్యాట్‌లను వినియోగించాలన్నది ఎన్నికల సంఘం నిర్ణయం.

> **పోలైన ఓట్ల సంఖ్యా వివరాలు వెల్లడించడానికి నిరాకరించడం ద్వారా ఇసి ఎన్నికల వ్యవస్థలో మోసాలు జరిగి వుంటాయనే సందేహాలు పెరగడానికి కారణమైంది. దాని రాజ్యాంగ ప్రతిష్టనూ దెబ్బతీసింది. ఎన్నికలు ముగిసిన తర్వాతనైనా ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఇ.సి చర్యలు తీసుకోలేదు. ఇవిఎం లలో నమోదైన ఓట్లకూ లెక్కింపు జరిగిన ఓట్ల సంఖ్యకూ భారీ తేడా ఎందుకు వచ్చిందనేది తేల్చనేలేదు. దేశ వ్యాపితంగా చూస్తే మొత్తం 5.14 కోట్ల ఓట్ల తేడా కనిపిస్తున్నది. దీనికి ఇ.సి నే జవాబుదారీ వహించాలి.**

కోట్ల ఓట్ల తేడాకు జవాబుదారీ ఏదీ?

స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం రాజ్యాంగ విహిత బాధ్యతలను నెరవేర్చి వుంటే ఫలితాలు బిజెపి, ఎన్‌డిఎలకు మరింత ప్రతికూలంగా వుండేవని సిపిఎం కేంద్ర కమిటీ తన ఎన్నికల సమీక్షలో వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చాలావరకూ ఎన్‌డిఎ భాగస్వామి పాత్ర పోషించిందని ఆ పార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. బిజెపి ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి తోడ్పట్టమే లక్ష్యంగా ఇ.సి వ్యవహరించింది. మోడీతో సహా బిజెపి నేతలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్టు ఆధారాలతో సహా కనిపిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వెనుకాడింది. మోడీకి ఇవ్వాల్సిన తాఖీదును బిజెపి అధ్యక్షుడిగా నడ్డాకు పంపి సరిపెట్టడమే గాక దాన్ని అన్ని పార్టీలకూ పంపి తన దోషాన్ని పంచే ప్రయత్నం చేసింది. అంతకంటే దారుణం పోలైన ఓట్ల సంఖ్యా వివరాలు వెల్లడించడానికి నిరాకరించడం ద్వారా ఇ.సి ఎన్నికల వ్యవస్థలో మోసాలు జరిగి వుంటాయనే సందేహాలు పెరగడానికి కారణమైంది. దాని రాజ్యాంగ ప్రతిష్టనూ దెబ్బతీసింది. ఎన్నికలు ముగిసిన తర్వాతనైనా ఈ పరిస్థితిని చక్కదిద్దడా నికి ఇ.సి చర్యలు తీసుకోలేదు. ఇవిఎం లలో నమోదైన ఓట్లకూ లెక్కింపు జరిగిన ఓట్ల సంఖ్యకూ భారీ తేడా ఎందుకు వచ్చిందనేది తేల్చనేలేదు. దేశ వ్యాపితంగా చూస్తే మొత్తం 5.14 కోట్ల ఓట్ల తేడా కనిపిస్తున్నది. దీనికి ఇ.సి నే జవాబుదారీ వహించాలి. అసలు 2019 ఎన్నికల ఓట్ల వివరాలే రెండేళ్ల తర్వాత సవరించడమంటే ఇక వ్యవస్థ విలువేమయ్యేట్టు? అంటే ఇక్కడ రాజ్యాంగ పరంగానూ, రాజకీయ కోణంలోనూ వ్యక్తిగతంగా ఆ యా అధికారులు అంటే కమిషనర్ల పరంగానూ కూడా సవాళ్లు కాదనలేనివి. స్వయంగా తాను సూచించిన కొన్ని తరుణోపాయాల పైన కూడా ఇ.సి పట్టు పట్టకపోవడం వంటివన్నీ ఇ.సి పారదర్శకత లోపాన్ని తెలియజేస్తున్నాయి. అన్నిటినీ కలిపి (మిక్సింగ్) లెక్కపెడితే మంచిదని ఇ.సి నే ఒకప్పుడు సూచన చేసింది. ఇందుకు టోటలైజర్ అనే సాధనం వాడవలసి వుంటుంది. ఇసిఐఎల్ అందులో ఏర్పాటు చేసింది కూడా. మన ఇవిఎంలలో ఆ విధంగా 14 క్లస్టర్ల ఓట్లు కలిపి చూసే అవకాశం వుంటుంది. సంబంధిత అభ్యర్థికి మొత్తం ఓట్లు ఎన్ని వచ్చాయో తెలుసుకోవడానికి ఒక బటన్ నొక్కితే సరిపోతుంది. లా కమిషన్ కూడా ఈ సూచనకు మద్దతునిచ్చింది.

ఎన్నికల పారదర్శకత కోసం గట్టిగా మాట్లాడి, అర్థంతరంగా పదవీ విరమణ చేసిన మాజీ కమిషనర్ అశోక్ లావాసా దీనిపై ఇటీవలే వ్యాసం కూడా రాశారు. టోటలైజర్ వినియోగించే సమయం ఇంకా రాలేదని మొన్నటి ఎన్నికల తర్వాత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. పారదర్శకత కోసం, ఇవిఎంలో ఓటింగు యూనిట్ల సీక్వెన్స్ మార్చాలని సిపిఎం మరో పద్ధతి సూచించింది. ప్రస్తుతం బ్యాలట్ యూనిట్ ముందు, తర్వాత వి.వి ప్యాట్, ఆ తర్వాత కంట్రోల్ యూనిట్ వుంటున్నాయి. అంటే వి.వి ప్యాట్ నిర్ధారించిన ఓటు, మొత్తం నమోదయ్యే కంట్రోల్ యూనిట్‌కు వెళ్లే ఓటు ఒకటే అవునో కాదో అర్థం కాదు. బండి ముందు గుర్రం వెనక చందంగా నడుస్తుంది. కనక ముందు బ్యాలట్, తర్వాత కంట్రోల్, ఆ పైన చివరగా వివి ప్యాలట్ వుంటే మెరుగని రాసింది. ఇందులో ఎలాంటి సాంకేతిక సమస్యలు కూడా లేవు. అయినా ఎన్నికల సంఘం నిరాకరించింది. ఏది ఏమైనా భారతీయ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత చాలా అవసరం. ఇవిఎంలో పోలైన ఓట్లకన్నా లెక్కించిన ఓట్లకు తేడా ఇంత ఎక్కువగా వుండడానికి కారణమేమిటో ఇ.సి సెలవివ్వాలి. ఇవిఎంలు ఉపయోగించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఇది ముందుకు తెచ్చింది. ఇందుకోసం పోరాటం కొనసాగవలసిందే.



> **గతంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ జయతి ఘోష్ కమిషన్ గానీ, కోనేరు రంగారావు భూ కమిటీ గానీ, చంద్రబాబు ప్రభుత్వం హయాంలో నియమించిన రాధాకృష్ణ కమిషన్ గానీ కౌలు రైతుల సంక్షేమానికి అనేక విలువైన సూచనలు చేశాయి. కమిషన్ల రిపోర్టులను ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేశాయే తప్ప వాటి అమలుకు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశాయి. 2011 భూ అధీకృత సాగుదారు చట్టం గానీ, 2019 పంట సాగు ద్వారా హక్కు చట్టం గానీ భూ యజమానుల భూమి హక్కుకు పూర్తి గ్యారెంటీ కల్పించాయి. అయితే భూమి కోల్పోతామని భూ యజమానులు భయపడుతున్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. వాస్తవం ఇది కాదు. పంటలు సాగు చేయకుండా కౌలుతో పాటు పంట రుణాలు, నష్టపరిహారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న పెట్టుబడి సాయం, ఇతర వ్యవసాయ సబ్సిడీలు పొందుతున్న భూ యజమానులు వాటిని కోల్పోతామని మాత్రమే భయపడుతున్నారు.**

కౌలు రైతుకు రుణం అందేనా?

విశ్లేషణ



కె. శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌లో 25 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. రాష్ట్రంలోని సాగు భూమిలో 50 శాతం పైగా సాగు చేస్తున్నది కౌలు రైతులే. పంట పండించేది, పెట్టుబడి పెట్టేది, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయేది, చివరకు వ్యవసాయ నష్టాలతో అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నది కౌలు రైతులే.

గత వైసిపి ప్రభుత్వ కాలంలో కౌలు రైతులకు అన్యాయం జరిగింది. పాత కౌలు చట్టాలను రద్దు చేసి 2019 పంట సాగుదారు హక్కు చట్టం తీసుకు వచ్చింది. ఈ చట్టంలో పొందుపరిచిన నిబంధనలు కౌలు రైతుల పాలిట శాపంగా మారాయి. 11 నెలలకు సంబంధించి కౌలు ఒప్పంద పత్రాలపై భూ యజమాని సంతకం చేస్తేనే కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు (సి.సి.ఆర్ కార్డులు) ఇస్తామని చెప్పడంతో గత ఐదు సంవత్సరాలుగా కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు లభించలేదు. అరకొరగా పంట సాగుదారు హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా దెబ్బతిన్న పంటలకు ఇచ్చిన ఇన్‌పుట్స్ సబ్సిడీ గానీ, పంటల బీమా పరిహారం గానీ కౌలు రైతులకు దక్కలేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కౌలు రైతుల ఆత్మహత్యలు పెరిగాయి.

2014లో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. అయితే రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలులో అనేక కొర్రీలు పెట్టి రైతు రుణమాఫీని కుదించింది. రూ.50 వేలు వరకు ఒకే విడతగా మాఫీ చేసి, ఆపై రూ.1.5 లక్షల వరకు ఐదు విడతలుగా రుణమాఫీ చేస్తానని చెప్పి మూడు విడతలు మాత్రమే రుణమాఫీ అమలు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఈ రుణమాఫీలో రైతు మిత్ర, జాయింట్ లయబిలిటీ గ్రూపుల ద్వారా కౌలు రైతులు తీసుకున్న రుణాలకు రుణమాఫీ పథకం అమలు కాలేదు. సర్వే నెంబరు ప్రాతిపదికన రుణమాఫీ పథకాన్ని అమలు చేశారు. 95 శాతం మంది భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇచ్చిన తామే పంటలు సాగు చేసినట్లుగా పంట రుణాలు బ్యాంకుల ద్వారా తీసుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన సర్వే నంబరు నిబంధనతో పంటలు సాగు చేయని భూ యజమానుల రుణాలే మాఫీ అయ్యాయి. కౌలు రైతులకు మొండి చేయి మిగిలింది. రుణమాఫీ కోసం కౌలు రైతులు ఎదురు చూడటంతో అపరాధ వడ్డీతో అప్పు తడిసి మోపిడయ్యింది. బ్యాంకర్లు కౌలు రైతులను నానా రకాలుగా ఇబ్బందులు గురిచేసి వన్ టైం సెటిల్మెంట్ పేరుతో తిరిగి అప్పులు కట్టించుకున్నారు. ప్రస్తుతం ఓటీఎస్ పేరుతో ఐదారు సంవత్సరాలుగా కౌలు రైతులకు బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా కౌలు రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన పంట సాగుదారు హక్కు చట్టంతో కౌలు రైతులు పెనం నుండి పొయ్యిలో పడ్డారు. అంతకు ముందు తీసుకున్న పంట రుణాలే తప్ప వైసిపి ప్రభుత్వ కాలంలో కౌలు రైతులకు అదనంగా రుణం వచ్చింది ఏమీ లేదు. 2020-21లో రూ. 1054 కోట్లు, 2021-22లో రూ. 1744 కోట్లు, 2022-23లో రూ. 1566 కోట్లు, 2023-24లో రూ. 1676 కోట్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చినట్లుగా బ్యాంకర్లు లెక్కలు చెబుతున్నారు. ఆచరణలో ఇవన్నీ గతంలో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేసుకున్నవే. 2024-25కు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కౌలు రైతులకు రూ.4 వేల కోట్లు రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.2.64 లక్షల కోట్లు రుణ లక్ష్యం కాగా, ఇందులో రూ.1.66 లక్షల కోట్లు పంట రుణ లక్ష్యంగా ప్రకటించారు. రాష్ట్రంలో 50 శాతం భూములు సాగుచేస్తున్న కౌలు రైతులకు రూ. 4 వేల కోట్లు ప్రకటించి గొప్ప కేటాయింపులుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది మొత్తం పంట రుణ లక్ష్యంలో కేవలం 3.5 శాతం మాత్రమే. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు ప్రకారం ఎటువంటి హామీ లేకుండా రూ. 1.5 లక్షల వరకు పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉంది.

ఇటీవల జరిగిన ఏలూరు జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వాలని, జిల్లాలో 75 శాతం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణ లక్ష్యాన్ని రూ. 250 కోట్లు నుండి రూ. 2 వేల కోట్లకు పెంచాలని ఆదేశాలిచ్చారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మాత్రం భూ యజమాని అంగీకారం లేకుండా ఇవ్వడం లేదు. గత ప్రభుత్వంలో ఇచ్చినట్లుగానే రైతు సేవా కేంద్రాల ద్వారా కౌలు ఒప్పంద పత్రాలపై భూ యజమాని సంతకాలు సి.సి.ఆర్ కార్డులు ఇస్తున్నారు. భూ యజమాని పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్సులు అడుగుతున్నారు. భూ యజమాని అనుమతి లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తేనే బ్యాంకుల్లో రుణం పొందడానికి వీలవుతుంది. బ్యాంకర్లు ఒక సర్వే నంబర్‌పై ఒకరికి మాత్రమే పంట రుణం ఇవ్వాలని నిబంధన ఉందని, అదే సర్వే నెంబర్‌పై మరొకరికి కౌలు రైతుకు రుణం ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో భూ యజమానులకు ఇస్తున్న పంట రుణాలను పంటేతర రుణాలుగా మార్చాల్సిన అవసరం ఉంది. పంట రుణాలు మాత్రం వాస్తవ సాగుదారులకే ఇచ్చేలా నిబంధనలు మార్చాలి. 2019 పంట సాగుదారు హక్కు చట్టంలో మార్పులు తీసుకురాకుండా ముఖ్యమంత్రి చెప్పినా, మంత్రి చెప్పినా కౌలు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేదు. కౌలు రైతులకు అనుకూలంగా చట్టం ఉన్నప్పుడే కార్డులు అందలేదు. భూ యజమానుల ఇష్టా యిష్టాలకు వదిలేస్తే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందే పరిస్థితి లేదు.

గతంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ జయతి ఘోష్ కమిషన్ గానీ, కోనేరు రంగారావు భూ కమిటీ గానీ, చంద్రబాబు ప్రభుత్వం హయాంలో నియమించిన రాధాకృష్ణ కమిషన్ గానీ కౌలు రైతుల సంక్షేమానికి అనేక విలువైన సూచనలు చేశాయి. కమిషన్ల రిపోర్టులను ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేశాయే తప్ప వాటి అమలుకు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశాయి. 2011 భూ అధీకృత సాగుదారు చట్టం గానీ, 2019 పంట సాగు ద్వారా హక్కు చట్టం గానీ భూ యజమానుల భూమి హక్కుకు పూర్తి గ్యారెంటీ కల్పించాయి. అయితే భూమి కోల్పోతామని భూ యజమానులు భయపడుతున్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. వాస్తవం ఇది కాదు. పంటలు సాగు చేయకుండా కౌలుతో పాటు పంట రుణాలు, నష్టపరిహారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న పెట్టుబడి సాయం, ఇతర వ్యవసాయ సబ్సిడీలు పొందుతున్న భూ యజమానులు వాటిని కోల్పోతామని మాత్రమే భయపడుతున్నారు.

ప్రభుత్వాలు కౌలు రైతులకి చేసే మేలు చాలా తక్కువ. ప్రచారం మాత్రం చాలా ఎక్కువగా చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా మార్చింది. ఇంతవరకు విధివిధానాలు ప్రకటించలేదు. కేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో రూ. 6 వేలు పెట్టుబడి సాయం కౌలు రైతులకు ఇవ్వలేదు. అయితే గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోయినా రూ.13,500 రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని చెప్పి, ఆచరణలో కౌలు రైతులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక తరగతులకు విభజించి అరకొరగా అమలు చేసి చేతులు దులుపు కుంది. ఓసి కౌలు రైతులను రైతు భరోసా పెట్టుబడి సాయం పథకానికి అనర్హులుగా ప్రకటించింది.

కౌలు రైతులను గుర్తించడం కష్టమేమీ కాదు. అందుకు తగిన చిత్తశుద్ధి కావాలి. 1977లో పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం మెరుగైన కౌలు చట్టాన్ని తీసుకొచ్చి కౌలు పాసు పుస్తకాలు ఇచ్చింది. మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వానికి పైసా ఖర్చు లేని గుర్తింపు కార్డు ఇవ్వడం కోసం కూడా ముందుకు రాకపోవడం అన్యాయమే.

నిన్న మొన్నటి వరకు కౌలు రైతుల ఎజెండాగా రాష్ట్రం అంతా తిరిగిన కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కౌలు రైతుల సంక్షేమంపై దృష్టి సారించాలి. కౌలు రైతుల సంక్షేమానికి ఒక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని చెప్పారు. చంద్రబాబు కూడా అనేక సందర్భాల్లో కౌలురైతుల కన్నీళ్లు తుడుస్తామని హామీలు ఇచ్చారు. ఇక ఆచరణే మిగిలింది. కౌలు రైతులు కూడా ప్రభుత్వాలు తమకు సాయం చేస్తాయని ఎదురు చూస్తే మోసపోవడం తప్ప మిగిలేదేమి లేదు. పోరాడితేనే చట్టం వచ్చింది. పోరాడితేనే కాస్త రుణం, నష్టపరిహారం సాధించుకున్న అనుభవాలు ఉన్నాయి. కౌలు రైతుల రక్షణకు సంఘటితమే మార్గం.

/ వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, సెల్ : 94900 98574 /

వి.సి నియామకాల్లో రాజకీయం తగునా?

విమర్శ



తొట్టిపూడి రాజా

> **వాస్తవానికి, రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూనివర్శిటీలకు పూర్తి స్థాయి వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలి. అలాగే యూనివర్శిటీలో ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వాలి. అలాగే ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను అధికార పార్టీ రాజకీయ కేంద్రాలుగా మార్చకుండా, వాటి స్వతంత్రను కాపాడాల్సిన అవసరం టిడిపి కూటమి ప్రభుత్వంపై ఉంది.**



రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 23 యూనివర్శిటీలకు ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్లను నియమించింది. ఆంధ్రా యూనివర్శిటీ, నాగార్జున యూనివర్శిటీ, రాయలసీమ యూనివర్శిటీ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్లను నియమించడంపై వివాదం తలెత్తింది. వాస్తవానికి, రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూనివర్శిటీలకు పూర్తి స్థాయి వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలి. అలాగే యూనివర్శిటీలో ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వాలి. అలాగే ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను అధికార పార్టీ రాజకీయ కేంద్రాలుగా మార్చకుండా, వాటి స్వతంత్రను కాపాడాల్సిన అవసరం టిడిపి కూటమి ప్రభుత్వంపై ఉంది.

యూనివర్శిటీల్లో రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలపై విస్తృత చర్చ ఉంటుంది. ఎందుకంటే యూనివర్శిటీలు విద్యార్థి ఉద్యమాలకు కేంద్రాలుగా ఉంటాయి. అలాంటి యూనివర్శిటీలు మేథోపరమైన చర్చలకు కేంద్ర బిందువుగా నిలిచాయి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలోని యూనివర్శిటీల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత వైసిపి ప్రభుత్వమైనా, అంతకు ముందున్న టిడిపి కూటమి ప్రభుత్వమైనా లేక ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వమైనా, ఏ ప్రభుత్వమైనా యూనివర్శిటీల్లో మౌలిక వసతుల కల్పన, బోధన, బోధనేతర నియామకాలు చేపట్టడంపై దృష్టి పెట్టకుండా, యూనివర్శిటీల్లో తమ రాజకీయ ఆధిపత్యం మీదనే కేంద్రీకరించాయి.

ప్రభుత్వం మారిన తరువాత యూనివర్శిటీలపై దాడి పెరిగింది. అందులో భాగంగానే యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లను బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. సెర్చ్ కమిటీ, ప్రభుత్వం, గవర్నర్ చేత ఒక స్వతంత్ర ప్రక్రియ ద్వారా నియమితులైన వైస్ ఛాన్సలర్లపై ఇలాంటి దాడి గతంలో ఎన్నడూ చూడలేదు. యూనివర్శిటీలను స్వతంత్ర విద్యాలయాలుగా చూడాలే తప్ప, అధికార పార్టీ రాజకీయానికి కేంద్రాలు కాకూడదు. అది గతంలో జరిగినా, ఇప్పుడు జరిగినా? తప్పు తప్పే. అయితే వైస్ ఛాన్సలర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించాలని ఎవరూ కోరటం లేదు. అవినీతి, అక్రమాలు బయట పెట్టి, టెర్మినేట్ ప్రక్రియ ద్వారా చర్యలకు పూనుకోవాలి. అంతే తప్ప ప్రజాస్వామ్యంలో దాడులు, బెదిరింపులకు తావుండకూడదు.

వి.సి నియామకం ఎలా?

రాష్ట్రంలో 23 ప్రభుత్వ యూనివర్శిటీలు, ఒక స్విమ్స్ ప్రత్యేక యూనివర్శిటీ ఉన్నాయి. వీటికి గవర్నర్ ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారు. వైస్ ఛాన్సలర్లు ఒక్కో యూనివర్శిటీకి ఒక్కొక్కరు ఉంటారు. అయితే వైస్ ఛాన్సలర్ కావాలంటే ప్రొఫెసర్‌గా పదేళ్ల సర్వీస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. పదవీకాలం మూడేళ్లు. రాష్ట్రంలో ఖాళీ అయిన యూనివర్శిటీలకు రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు గవర్నర్ వైస్ ఛాన్సలర్లను నియమిస్తారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేస్తుంది. ఈ సెర్చ్ కమిటీ సీనియారిటీ, అర్హతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ముగ్గురు పేర్లను సూచిస్తుంది. ఆ ముగ్గురు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే ఆ ప్రతిపాదనలను గవర్నర్ ఆమోదించవచ్చు. లేకపోతే వెనక్కి తిప్పి పంపవచ్చు. ఆమోదిస్తే ఆ ముగ్గురిలో ఒకరు వైస్ ఛాన్సలర్ అవుతారు.

ఖాళీల భర్తీ ఎప్పుడు?

రాష్ట్రంలోని యూనివర్శిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనివల్ల యూనివర్శిటీల్లో ఖాళీలు కోకొల్లలుగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ రోస్టర్ విధానం అమలులో లోపాలున్నాయని కోర్టులో కేసు వేయడంతో ఆ నోటిఫికేషన్ అలాగే ఉండిపోయింది. 2023 అక్టోబర్ 30న రాష్ట్రంలోని 18 యూనివర్శిటీల్లో 2,933 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఆ నోటిఫికేషన్ మరుగున పడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం యూనివర్శిటీల్లో ఖాళీల భర్తీ గురించి ఒక్క మాట కూడా మాట్లాడడంలేదు. మరోవైపు యూనివర్శిటీ కాంట్రాక్ట్ బోధన సిబ్బంది ఐదు వేల మంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 2,300 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరికి జీతాలు సరిగా విడుదల చేయటం లేదు. పదోన్నతలు కూడా అమలు చేయలేదు. అలాగే ఉద్యోగ భద్రత కూడా లేదు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయటం లేదు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అవుతున్నాయి. ఒకవైపు బోధన సిబ్బంది కొరత, మరోవైపు మౌలిక వసతల లేమి కారణంగా యూనివర్శిటీలు సతమతం అవుతున్నాయి. దీనివల్ల విద్యార్థులు ప్రైవేట్ యూనివర్శిటీలకు, ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టి పని చేయాలి. విద్యా రంగ పరిరక్షణ, స్వతంత్రతకు, అభివృద్ధికి...విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరపాల్సిన, ఆ సంప్రదింపుల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

(వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సెల్ : 9985611648)

అగ్నివీర్ పరీక్షలోనూ అక్రమాలు

- తక్కువ మార్కులొస్తే పాస్...ఎక్కువొస్తే ఫెయిల్
- కటాఫ్ కంటే తక్కువొచ్చినా ఎంపిక
- పరస్పర విరుద్ధ ప్రకటనలతో గందరగోళం



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ నియామక పరీక్షల్లో పెద్ద ఎత్తున కుంభకోణాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా సైనిక దళాల్లో నియామకాలకు సంబంధించిన అగ్నిపథ్ పథకంపై కూడా వివాదం చెలరేగుతోంది. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో 2022 సెప్టెంబర్-నవంబర్‌లో జరిగిన అగ్నివీర్‌ల నియామక పరీక్షలో కూడా రిగ్గింగ్ జరిగిందని అభ్యర్థులు ఆరోపించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాలో చోటు సంపాదించిన ఓ అభ్యర్థి కంటే తమకు ఎక్కువ మార్కులే వచ్చాయని, అయినప్పటికీ తాము ఎంపిక కాలేదని వారు తెలిపారు.

ఎంపిక కాని అభ్యర్థుల్లో సాత్నాకు చెందిన అమన్ ద్వివేది ఒకరు. ఆయన 2022 డిసెంబరులో రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ నెల 1న స్పందించింది. జబల్పూర్‌లో అగ్నివీర్ నియామకం సందర్భంగా ఎంపికైన అభ్యర్థులందరి మార్కులను పక్షం రోజుల్లో పిటిషనర్లకు అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అంతకుముందు మార్కులను బహిర్గతం చేసేందుకు సైన్యం నిరాకరించింది. ఈ వ్యవహారంపై 'ది వైర్' హిందీ పోర్టల్ ప్రత్యేక పరిశోధన చేపట్టింది.

కటాఫ్ మార్కుల కంటే తక్కువ వచ్చినా...

జబల్పూర్‌లో 2022 సెప్టెంబరులో ఫిజికల్ టెస్ట్, నవంబర్ 13న రాత పరీక్ష నిర్వహించారు. నవంబర్ 26న ఫలితాలు ప్రకటించారు. వీటిపై అసంతృప్తి వ్యక్తం చేసిన పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు ఆర్‌టీఐ కింద దరఖాస్తు కూడా చేశారు. ఆర్‌టీఐ కింద అందిన సమాధానం ప్రకారం నితీష్ కుమార్ తివారీకి రెండు పరీక్షల్లో కలిపి 159 మార్కులు వచ్చాయి. ఎంపికైన అభ్యర్థుల జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. అయితే ఇక్కడే పలువురు అవాక్కయ్యారు. ఎందుకంటే మరో అభ్యర్థి దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తుకు వచ్చిన సమాధానం ప్రకారం అభ్యర్థుల ఎంపికకు సైన్యం 169 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించింది. కాగా ఫలితాలు ప్రకటించిన నెల రోజుల తర్వాత వైద్య పరీక్ష నిర్వహించగా నితీష్ అందులో ఫెయిల్ అయ్యారు. దీంతో ఆయన సైన్యంలో చేరలేదు.

అక్కడ అలా...ఇక్కడ ఇలా

వైద్య పరీక్షలో ఫెయిల్ అయిన నెలన్నర రోజుల తర్వాత నితీష్‌కు ఆర్మీ నియామకాల కేంద్రం నుండి ఓ ఆర్‌టీఐ సమాధానం వచ్చింది. 'నితీష్ పాసయ్యాడు కానీ మెరిట్ జాబితాలో స్థానం దక్కలేదు' అన్నది దాని సారాంశం. అయితే సైన్యం విడుదల చేసిన జాబితా (అదే మెరిట్ జాబితా) ప్రకారం ఎంపికైన అభ్యర్థుల్లో ఆయన కూడా ఒకరు. ఆర్మీ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న పరీక్షా ఫలితాలను పరిశీలిస్తే నితీష్‌ను ఇప్పటికీ ఎంపికైన అభ్యర్థిగా చూపుతున్నారు. సైనికాధికారులు ఇలా పరస్పర విరుద్ధంగా ఎలా వ్యవహరించారో అర్థం కావడం లేదు. ఆర్‌టీఐ సమాధానం చూసిన తర్వాత తన అనుమానాలన్నీ నిజమేనని తేలిందని, అగ్నివీర్‌ల ఎంపికలో రిగ్గింగ్ జరిగిందని తేలిపోయిందని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన గౌతమ్ తెలిపారు. 'నా విద్యార్థుల్లో చాలా మందికి 160-167 మధ్య మార్కులు వచ్చాయి. వీరిలో ఏ ఒక్కరి పేరు ఎంపికైన అభ్యర్థుల జాబితాలో లేదు. కానీ 159 మార్కులు వచ్చిన నితీష్ పేరు జాబితాలో ఎలా ఉంది?' అని ఆయన ప్రశ్నించారు.

తప్పు తెలుసుకొని...

ఆర్‌టీఐ సమాధానం ప్రకారం నితీష్ కంటే ఎక్కువ మార్కులు వచ్చిన సుజిత్ కుమార్ రావత్ (160.5), వికాస్ సింగ్ (163), అభిషేక్ వర్మ (165.5), సచిన్ సింగ్ (166.5), సౌరబ్ సింగ్ (167) ఫెయిలయ్యారు. పరీక్షా ఫలితాలపై కొందరు అభ్యర్థులు న్యాయస్థానంలో పిటిషన్లు వేయడంతో నితీష్ పేరును జాబితా నుండి తొలగించారని గౌతమ్ ఆరోపించారు. నితీష్ పేరును జాబితాలో ఉంచితే తమకు సమస్యలు తప్పవని సైనికాధికారులు గ్రహించారని, అందుకే చివరి నిమిషంలో అతని పేరును తొలగించారని తెలిపారు. కాగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలో స్థానం దక్కని పలువురు అభ్యర్థులు తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ వారికి చుక్కెదురైంది. దీంతో వారు సాయుధ దళాల ట్రిబ్యునల్‌కు వెళ్లారు. అక్కడా నిరాశ ఎదురైంది. చివరికి మళ్లీ హైకోర్టులో పిటిషన్లు వేశారు.

'విద్వేష' ఉత్తర్వులు వెనక్కి తీసుకోండి

- యుపి, ఉత్తరాఖండ్ చర్యలపై సిపిఎం ఆందోళన

న్యూఢిల్లీ : కన్వర్ యాత్రా మార్గం పొడవునా వుండే తినుబండారాల దుకాణాలన్నీ తమ యజమానుల పేర్లను వెల్లడి చేస్తూ బోర్డులు పెట్టాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. మతోన్మాద పోకడలకు మరింత పదును పెడుతూ మతపరమైన కమ్యూనిటీల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు ఈ చర్య ఉద్దేశించబడిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమైనదని, పౌరుల ప్రాథమిక హక్కైన సమానత్వపు హక్కు పునాదిని దెబ్బ తీస్తోందని విమర్శించింది. మతోన్మాద ధోరణులను రెచ్చగొట్టడమే ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాల లక్ష్యంగా వుందని పేర్కొంది. ఈ ప్రభుత్వాలు తీసుకునే ఇటువంటి చర్యలు కుల ఉద్రిక్తతలు పెచ్చరిల్లడానికి దారి తీసే ప్రమాదముందని, కులాల ప్రాతిపదికన సామాజిక అణచివేత ఉధృతమవుతుందని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. మనుస్మృతిలో చెప్పిన తరహాలో మన సమాజాన్ని పునర్వ్యవస్థీకరించడానికి బిజెపి లక్ష్యంగా చేసుకుని ఈ ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయానికి హామీ కల్పిస్తున్న మన రాజ్యాంగం పునాదులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించింది. ఎన్‌డిఎ కూటమిలోని బిజెపి మిత్రపక్షాలు ఇటువంటి విచ్ఛిన్నకరమైన, ప్రమాదకరమైన చర్యలను, ఎత్తుగడలను అనుమతించనివ్వకుండా హామీ కల్పించాలని పొలిట్‌బ్యూరో కోరింది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకునేలా యుపి, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరింది.

22న పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ సమావేశాల తొలిరోజు లోక్‌సభ ముందుకు ఆర్థిక సర్వే రానుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 22న కేంద్ర బడ్జెట్‌కు ఒక రోజు ముందు పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులకు ఈ నివేదిక ఒక కొలమానంగానూ, భవిష్యత్‌కు మార్గనిర్దేశంగా భావిస్తారు. ఈ సర్వేలో దేశ ఆర్థిక పరిస్థితి, అవకాశాలు, విధాన సవాళ్లను సవివరంగా వెల్లడించాల్సివుంటుంది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని బృందం ఈ నివేదికను రూపొందించింది. ఆర్థిక సర్వే ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై గణాంక సమాచారం, విశ్లేషణతో పాటు ఉపాధి, జిడిపి వృద్ధి, ద్రవ్యోల్బణం, బడ్జెట్ లోటుపై డేటాను అందిస్తుంది. భారత్ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే.



కులగణన అవసరమే.. కానీ..!

- కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించడం అవసరమని, అయితే ఆ సమాచారాన్ని బహిర్గతం చేయకుండా కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షులు చిరాగ్ పాశ్వాన్ అన్నారు. సమగ్ర కుల గణన చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంపై శనివారం మీడియాతో పాశ్వాన్ మాట్లాడారు. దేశంలో కులగణన చేపట్టేందుకు మద్దతు తెలిపారు. కానీ, అది సమాజ విభజనకు దారి తీస్తుందని, అందుకే వాటి సమాచారాన్ని బహిర్గతం చేయరాదని ఆయన హెచ్చరించారు. 'కమ్యూనిటీ ఆధారిత అభివద్ధి పథకాలకు నిధుల కేటాయింపు కోసం నిర్దిష్ట డేటా తరచూ అవసరమవుతోంది. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ డేటా ఉపయోగపడుతుంది. కులగణన నిర్వహించడం అవసరమే. కానీ, ఇందులో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. కులగణన ద్వారా సమాజంలో విభజన ఏర్పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ గణాంకాలను బయటకు తీసుకురావడం అంత మంచిది కాదు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదు' అని విలేకరుల సమావేశంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కుల గణనపై ప్రతిపక్షాలు పదేపదే డిమాండ్ చేస్తున్నా..మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో పాశ్వాన్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

ఉచిత విద్యుత్.. నెలకు రూ.వెయ్యి సాయం

- హర్యానా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ 'పంచతంత్ర'
- కేజ్రీవాల్ భరోసాల పేరిట ఆప్ ఐదు హామీలు

ఛండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల కోసం ఆమ్‌ఆద్మీ పార్టీ 'పంచతంత్ర' వ్యూహంతో దూకుడు పెంచింది. రాష్ట్ర ప్రజలందరికీ 24 గంటల ఉచిత్ విద్యుత్ అందిస్తామని, మహిళలకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక చేయూతనందిస్తామని ఆప్ ప్రకటించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా హర్యానాలోని పంచకులలో శనివారం నిర్వహించిన సభలో ఆప్ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రీవాల్ ఈ హామీలను ప్రకటించారు. ఈ సభలో ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, పంజాబ్ సిఎం భగవంత్ మాన్ సింగ్ కూడా పాల్గొన్నారు. 'కేజ్రీవాల్ భరోసాలు' పేరిట ఆవిష్కరించిన ఈ హామీల్లో ప్రధానంగా 24 గంటల ఉచిత విద్యుత్, కుటుంబంలోని అందరికి ఉచిత వైద్యం, పిల్లలకు నాణ్యమైన విద్య, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.1000 అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్ ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 'కేజ్రీవాల్ హర్యానాలో పుట్టి పెరిగారు. ఆయన ఏమి లేని దశ నుంచి పార్టీని ప్రారంభించి ఢిల్లీకి ముఖ్యమంత్రి అయ్యారు. ఢిల్లీని పరిపాలిస్తారని ఎవరూ ఊహించి ఉండరు. ఇది చిన్న విషయం కాదు. పెద్ద నాయకులు చేయలేని మంచి పనులు ఆయన చేశారు' అని తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. అక్టోబర్‌లో జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఆప్ ఇప్పటికే ప్రకటించింది.

అందరి ర్యాంకులూ మారాయి !

- నీట్ పునర్ పరీక్షతో ఫలితాల్లో భారీ వ్యత్యాసం

న్యూఢిల్లీ : నీట్ యుజి 2024 పరీక్షలో అక్రమాలు చోటుచేసుకోవడం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ పరీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు విచారణలో భాగంగా నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా నీట్-యూజీ ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) శనివారం వెల్లడించింది. పునర్ పరీక్ష రాసిన అందరి ఫలితాల్లోనూ గతంతో పోలిస్తే స్పష్టమైన మార్పు కనిపించిందని, అందరి ర్యాంకులూ మారాయని ఎన్‌టిఎ తెలిపింది. ఎన్‌టిఎ డేటా ప్రకారం..జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు వచ్చాయి. ఆ ఫలితాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం ఆ పరిస్థితికి దారితీసిందని గుర్తించిన సుప్రీం.. వారికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. వారిలో 813 మంది మాత్రమే హాజరయ్యారు. ఫలితాల అనంతరం సదరు కేంద్రంలో వచ్చిన అత్యధిక స్కోరు 682గా ఉండటం గమనార్హం. అది కూడా ఒక్క విద్యార్థికే వచ్చింది. 13 మంది విద్యార్థులకు 600 పైగా మార్కులు వచ్చాయి. తొలుత వెల్లడైన ఫలితాలకు వీటికి మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. ఇదిలా ఉండగా.. నీట్ పరీక్షలో పేపర్ లీక్ జరిగిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. మరోపక్క ఈ అవకతవకలపై సుప్రీంలోనూ విచారణ జరుగుతోంది.

ఇంతటి నీచానికి ఒడిగడతారా !

- మొఘల్ పాలకుల పేర్లున్న రోడ్ల బోర్డులపై బిజెపి వికృత చేష్టలు
- ఖండించిన సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ

న్యూఢిల్లీ : అక్బర్, హుమయూన్, షాజహాన్ వంటి మొఘల్ చక్రవర్తులు, తుగ్లక్ రాజవంశానికి చెందినవారి పేర్లతో వున్న రోడ్ సంకేతాల బోర్డులను వికృతంగా మార్చివేయడాన్ని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఢిల్లీలో లుటియన్స్ ప్రాంతంలో ఇంతటి దారుణమైన విధ్వంసం చోటు చేసుకుందని, ఇది హిందూత్వ మతోన్మాద శక్తుల పనే అని సిపిఎం విమర్శించింది. ఇస్లామ్ మతాన్ని అనుసరించిన మధ్యయుగ పాలకుల ప్రస్తావనేదీ చరిత్రలో లేకుండా, ప్రజల మనస్సుల్లో లేకుండా చేయడానికి చేస్తున్న భయంకరమైన ప్రయత్నాల్లో భాగమే ఇవన్నీ అని విమర్శించింది. ఈ పాలకులను రాక్షసులుగా, వారి పాలనను 800 సంవత్సరాల బానిసత్వంగా చిత్రీకరించడం చూస్తుంటే ముస్లింల పట్ల విద్వేషాలను రెచ్చగొట్టడమే లక్ష్యంగా వుందని సిపిఎం కమిటీ విమర్శించింది. మతోన్మాద పోకడలకు మరింత పదును పెట్టేందుకు హిందూత్వ మతోన్మాద శక్తుల నీచమైన ఈ ప్రయత్నాలను గట్టిగా తిప్పికొట్టాలని సిపిఎం ప్రజలకు పిలుపునిచ్చింది. పైగా ఇలాంటి వికృత చర్యలు చేపట్టిన ప్రాంతం ఢిల్లీ పోలీసుల భారీ బందోబస్తులో వుందని పేర్కొంది.అయినా ఇప్పటివరకు ఒక్క నిందితుడిని కూడా అరెస్టు చేయలేదని విమర్శించింది. ఈ వికృత చేష్టలకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి,ఇలాంటి క్రిమినల్ చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఢిల్లీ పోలీసులను, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖను సిపిఎం డిమాండ్ చేసింది.

జనావాసాలపై ఇజ్రాయిల్ దాడులు

- ధ్వంసమైన భవనాలు.. 37 మంది మృతి



గాజా : గాజాలో జనావాసాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఆర్మీ వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. గత 24 గంటల్లో 37 మంది పాలస్తీనియన్లు మరణించారు. 54 మంది గాయపడ్డారు. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. నుస్రత్ శరణార్థ శిబిరంలో నివాస భవంతిపై శనివారం ఉదయం దాడి జరిగింది. గాజాలో ఇజ్రాయిల్ దాడులు మొదలైనప్పటి నుండి ఇప్పటివరకు 38,919 మంది మరణించగా, 89,622 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో 161 మంది జర్నలిస్టులు వున్నారు.

నెతన్యాహు ఒక ఉగ్రవాది : పాక్

కాగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఒక ఉగ్రవాది అని పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించగా..ఆ ప్రకటనను హమాస్ స్వాగతించింది. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడిందని, క్రిమినల్ ప్రధాని ఒక ఉగ్రవాది అని శుక్రవారం పాక్ ప్రభుత్వ సలహాదారు రానా సనావుల్లా పేర్కొన్నారు. పాలస్తీనియన్లపై పాల్పడిన యుద్ధ నేరాలకు తక్షణమే నెతన్యాహును విచారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒలింపిక్స్‌లో గాజాపై గళం

ఒలింపిక్స్‌లో పాలస్తీనా క్రీడాకారులు గాజాలో జరుగుతున్న అకృత్యాల పట్ల అందరిలో అవగాహన కల్పించనున్నారు. పాలస్తీనా ఈతగాళ్ళు యాన్ అల్ బవాబ్, వాలెరి తారాజిలు తమ మాతృదేశంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రపంచానికి తెలియచేయనున్నారు. ఈ నెల 26న జరగనున్న ఒలింపిక్స్ ప్రారంభోత్సవాల్లో తన దేశ పతాకాన్ని చేబూని నడవడాన్ని గర్వంగా భావిస్తానని వ్యాఖ్యానించారు.

'మేమూ మనుషులమే' అని ప్రపంచానికి చాటి చెప్పడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటామని చెప్పారు. పారిస్ ఒలింపిక్స్‌లో 8మంది పాలస్తీనా అథ్లెట్లు పాల్గొంటున్నారు. మరోవైపు నెతన్యాహు గద్దె దిగాలని, గాజాలో అదుపులో వున్న బందీలను తక్షణమే విడిపించాలని కోరుతూ ఇజ్రాయిల్ బందీల బంధువులు శనివారం కూడా భారీ ప్రదర్శనలు నిర్వహించారు.

గాజాలో మారణ హోమానికి మూల్యం తప్పదు

- హౌతీల హెచ్చరిక

సనా: గాజాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని ఆపాలని, లేకుంటే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుందని యెమెన్‌లోని సాయుధ బలగాలు హెచ్చరించాయి. హౌతీ సాయుధ బలగాల ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ శనివారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఇజ్రాయిల్ నగరమైన టెల్ అవీవ్‌పై శుక్రవారం తాము చేసిన డ్రోన్ దాడి ఒక శాంపిల్ మాత్రమేనని అన్నారు. ఈ దాడిలో ఒకరు చనిపోగా, మరో 10 మంది మరణించారు. అమెరికా ఎంబసీకి వందల మీటర్ల దూరంలోని షాలోమ్ అలీచెమ్ బెన్ యెహుదా కూడలి వద్ద ఈ డ్రోన్ దాడి జరిగింది. ఇజ్రాయిల్ వాణిజ్య కేంద్రంగా పరిగణించబడుతున్న టెల్ అవీవ్‌పై హౌతీలు దాడి చేయడం ఇదే మొదటిసారి. ఇది తమ పనేనని హౌతీ సాయుధ బలగాల ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ ప్రకటించారు. టెల్ అవీవ్ దుర్భేధ్యమైన నగరమేమీ కాదని చాటి చెప్పడమే ఈ డ్రోన్ దాడి లక్ష్యమని ఆయన చెప్పారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలబడడంతోబాటు, ఈ మారణ హోమానికి కారణమైన యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వానికి తగు బుద్ధి చెబుతామని ఆయన టివీలో చేసిన ప్రకటనలో హెచ్చరించారు. యెమెన్ హౌతీల డ్రోన్ దాడలకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయిల్ హూంకరించింది.

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ

(మొదటి పేజీ తరువాయి)

మెసేజ్ సర్వీస్‌లను ఈ నెల 18న రద్దు చేయడంతో బంగ్లాదేశ్‌కు ఇతర ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శుక్రవారం సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల మధ్య సమయంలో తమ ఆస్పత్రికి 27 మృత దేహాలు వచ్చాయని ఢాకా మెడికల్ కాలేజీ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గత ఐదు రోజులుగా ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, గ్రెనెడ్లను ప్రయోగించారు. వాహనాలపై రాళ్లు విసరడం, నిప్పంటించడం వంటి చర్యలకు దిగారు. మృతుల సంఖ్య పెరుగుతూ వుండడం, నిరసనలను పోలీసులు అదుపు చేయలేకపోవడంతో ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం శుక్రవారం కర్ఫ్యూ విధించి, ప్రజలు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు వీలుగా రెండు గంటల పాటు కర్ఫ్యూ సడలించారు. ఆదివారం ఉదయం 10గంటల వరకు కర్ఫ్యూ అమల్లో వుంటుంది. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు 30 శాతం రిజర్వేషన్ల విధానాన్ని హసీనా ప్రభుత్వం 2018లో రద్దు చేసింది. దీనిపై కొందరు హైకోర్టుకు వెళ్లగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో రిజర్వేషన్లు పునరుద్ధరించబడ్డాయి. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. దీనిపై ఆగస్టులో విచారణ జరగనుండగా, ఇంతలోనే విద్యార్థులు పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు.

స్వదేశానికి తిరిగొచ్చిన 978మంది భారతీయ విద్యార్థులు

బంగ్లాదేశ్‌లో హింస్మాక నిరసనలు తలెత్తిన నేపథ్యంలో అక్కడ నుండి భారతీయ విద్యార్థులను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు ఢాకాలోని భారత హై కమిషన్ కార్యాలయం చర్యలు తీసుకుంది. ఇప్పటివరకు వివిధ నౌకల ద్వారా 778మంది విద్యార్థులు భారత్‌కు చేరుకోగా మరో 200మంది వరకు విమానాల ద్వారా వచ్చారు.

కేరళలో మళ్ళీ నిపా కలకలం

తిరువనంతపురం : కేరళలో మళ్ళీ నిఫా వైరస్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా మలప్పురం జిల్లాలో ఈ వైరస్ బయటపడింది. ఈ వైరస్ సోకిన 15 ఏళ్ళ బాలుడి పరిస్థితి విషమంగా వుంది. కొజికోడ్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆ బాలుడు చికిత్స పొందుతున్నాడు. మలప్పురం జిల్లాలోని పండిక్కాడ్‌కు సమీప ప్రాంతానికి చెందిన ఈ బాలుడికి నిఫా లక్షణాలు బయటపడడంతో వెంటనే కొజికోడ్‌కు తీసుకెళ్లారు. అక్కడ ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స తీసుకుంటున్నాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వెంటనే ఆ ఆస్పత్రిలో ఒక వార్డును నిఫా రోగుల కోసం ప్రత్యేకంగా కేటాయించారు. అవసరమైన డాక్టర్లు, నర్సులను ఏర్పాటు చేశారు. నిఫా వైరస్ చికిత్స,ఇతర కార్యకలాపాల కోసం 14 కమిటీలను ఏర్పాటు చేశారు. వ్యాధి విస్తరించకుండా తీసుకోవాల్సిన చర్యలను పర్యవేక్షించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి మలప్పురం వెళ్ళారు. నిఫా వైరస్‌ను పూనేలోని వైరాలజీ సంస్థ ధృవీకరించిందని చెప్పారు. వెంటనే ఆరోగ్య శాఖాధికారులు రంగంలోకి దిగి నిఫా ప్రొటోకాల్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. ఆ బాలుడితో పాటు వున్న ముగ్గురిని క్వారంటైన్‌లోకి పంపారు. 214 మందిపై నిఘా పెట్టారు. వారిలో 60 మంది అత్యంత హై రిస్క్ కేటగిరీకి చెందినవారని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు.



వర్ష రుతువు



కరి మబ్బులు కరిగి కరిగి
జోరువాన కురిసింది
ఊరూవాడ నీటి తోటి
పొంగి పొరలి పారింది!

శ్రావణము, భాద్రపదం
వర్ష ఋతువు వచ్చింది.
పండిన ఆ బీడులను
తడిసి ముద్ద చేసింది!

చెరువులన్ని నిండాయి
రైతు కలలు పండాయి
ఎదుగుతున్న పంటకు
తగు నీటిని కూర్చాయి!

గట్టునున్న మొక్కలన్నీ
కొత్త కొత్త కొమ్మ లేసి .
ప్రతి కొమ్మా పూలు పూసి
కాయలెన్నో కాసాయి!

పట్టణాల్లో తాగునీరు
పల్లెలలో సాగునీరు
ప్రతి వారికి చేరింది
జలం కొరత తీరింది!

ఎండయినా వానయినా
సమయానికి రావాలి
అతివృష్టి అనావృష్టి
రైతు నొదిలి పోవాలి!

\- కూచిమంచి నాగేంద్ర
91821 27880.

ఒత్తు పదాలు రాయండి!

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అక్షరాల పక్కన అర్థవంతమైన పదాలు వచ్చేలా ఒత్తు పదాలు రాయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

అమ్మ

కు-	వి-
ప-	శ-
చె-	తొ-
జ-	మ-





అన్షుమాన్,
4వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి, గుంటూరుజిల్లా.

నేను గీసిన బొమ్మ







ఎ. యశ్వంత్,
8వ తరగతి,
రాంపూర్ మండలం, నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పొలంలో విద్యుత్ మోటార్ ఆన్, ఆఫ్ ఫోన్ ద్వారా ఇంట్లో నుంచే చేయొచ్చు. ఇంట్లో నుంచి బయటకు వెళ్తే లైట్లు, ఫ్యాన్లు ఆటోమెటిక్‌గా ఆగిపోతాయి. కారు నడుపుతున్నారా? నిద్ర వస్తే సీటుబెల్టు అలారం జాగ్రత్త అంటూ హెచ్చరిస్తుంది. కారు వేగంగా నడుపుతున్నారా? స్పీడు ఎక్కువైంది తగ్గించండి? అంటూ వార్నింగ్ వస్తుంది. హెల్మెట్ పెట్టుకుంటేనే మీ టూవీలర్ స్టార్టవుతుంది. ఇవన్నీ ఎలా సాధ్యమని అనుకుంటున్నారా? అదే ఇన్నోవేషన్ రోబోటిక్స్ ప్రత్యేకత. ఇప్పుడు ప్రపంచం ఈ సెన్సార్ టెక్నాలజీపైనే ఆధారపడి నడుస్తోంది. ఇలాంటి ఇన్నోవేషన్ టెక్నాలజీని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేస్తున్నారు దాసరి నరేంద్ర.

రోబోటిక్ బూట్ క్యాంపులతో విద్యార్థుల్లో సాంకేతిక సృజన





పల్నాడు జిల్లా గురజాల మండలం జంగమేశ్వరపురం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, పార్వతి దంపతుల కుమారుడు దాసరి నరేంద్ర తండ్రి వెల్డింగ్ షాపును నిర్వహిస్తున్నారు. తల్లి వ్యవసాయ పనులు చేస్తున్నారు. నరేంద్ర ప్రాథమిక విద్యను గురజాలలోని లిటిల్‌ఫ్లవర్ స్కూలులో పూర్తిచేశారు. గుంటూరు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో ఇన్ మెకానికల్ చదివారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో డిజైన్ టెక్నాలజీలో మాస్టర్స్‌ను పూర్తిచేశారు. ఆ తర్వాత డిజైన్ టెక్నాలజీ అధ్యాపకునిగా కొంతకాలం పనిచేశారు. కరోనా తర్వాత తనే ఎస్ఆర్ఎంయు రోబోటిక్స్ పేరుతో యూనిట్‌ను ఏర్పాటుచేసి నడుపుతున్నారు. గత కొన్నేళ్లుగా రోబోటిక్స్ టెక్నాలజీ ద్వారా పలు సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం దేశ, విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు సైతం ఈ యువశాస్త్రవేత్త ప్రతిభను శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

హైస్కూల్ స్థాయి నుంచే ఆవిష్కరణలు

నరేంద్ర డిజైనింగ్ టెక్నాలజీపై హైస్కూలు స్థాయి నుంచే బాగా ఆసక్తి పెంచుకున్నారు. తొమ్మిదో తరగతిలోనే మొబైల్ ఫోన్ ద్వారా వ్యవసాయ మోటార్లు ఆపరేట్ చేయటం, సిరంజిలతో జేసీబీతో పనిచేయించటం, డైనమో ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయటం వంటివి రూపొందించి, ఉపాధ్యాయుల ప్రశంసలు పొందాడు. పదో తరగతి నుంచే కంప్యూటర్ చిప్‌లు, ప్రోగ్రామింగ్‌తో సంబంధం లేకుండా కేవలం ఎలక్ట్రానిక్ బోర్డు ద్వారా రోబోటిక్ యంత్రాలు తయారు చేయటానికి ప్రయత్నాలు చేశాడు. డిప్లమో మొదటి ఏడాదిలోనే వెలుతురు ఆధారంగా వీధి దీపాలు పనిచేయటానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డుతో పనిచేసే పరికరాన్ని రూపొందించాడు. అప్పటి నుంచి కంప్యూటర్ సహాయం లేకుండా ఐఆర్ సెన్సార్లు ఉపయోగించి యాంత్రిక శక్తిని తయారుచేయొచ్చునని నరేంద్రకు నమ్మకం కల్గింది. తరువాత కొన్ని ప్రయోగాలు చేసి, జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టే రోబోటిక్ యంత్రం తయారీకి అవసరమైన పీసీబీ బోర్డును తయారుచేశాడు.

ఎలక్ట్రానిక్ బోర్డుతో నడిచే రోబోలు

లైట్ డిపెండెంట్ నుంచి వచ్చిన సిగ్నల్‌ను పీసీబీ బోర్డు ద్వారా యాంత్రిక శక్తిగా మార్చి పనిచేసే రెండు రోబోటిక్ యంత్రాలను రూపొందించారు నరేంద్ర. రహదారి ప్రమాదాలను అరికట్టే ఎడ్జ్ డిటక్షన్ రోబోటిక్ యంత్రం. పరిశ్రమల్లో అంతర్గత అవసరాల కోసం ఉపయోగించే లైన్ పాలో రోబోటిక్ యంత్రం తయారుచేశారు. వాహనం ముందు ఉండి రహదారి స్థితికి అనుగుణంగా వేగాన్ని నియంత్రించే శక్తిని రోబోటిక్ ఎడ్జ్ డిటెక్షన్ యంత్రాంగం కల్గివుంది. ఘాట్ రోడ్డులో వాహనాల్లో వెళ్తున్నప్పుడు అదుపు తప్పితే గమనించి వాహనాన్ని అదుపులో ఉంచటం దీని ప్రత్యేకత. రోబోటిక్ ద్వారా భారీ పరిశ్రమల్లో రా మెటీరియల్‌ను తయారైన ఉత్పత్తులను నిర్ణీత ప్రదేశానికి మనిషి సహాయం లేకుండా చేరవేయొచ్చు.

హెల్మెట్ ధరిస్తేనే బండి కదిలేది

ఇప్పుడు చాలా రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేనందున ప్రాణాపాయం కలుగుతుంది. దీని నియంత్రణకు నరేంద్ర ఒకపుపాయం కనుక్కున్నాడు. దీని ప్రకారం... బైక్ సెల్ఫ్ స్టార్ట్ నొక్కగానే వాహనదారు హెల్మెట్ ధరించాడా? లేదా? అన్న సందేశాన్ని గుర్తిస్తుంది. హెల్మెట్ ధరిస్తే డివైస్ గ్రీన్ సిగ్నల్ యాక్టివేట్ అవ్వటం ద్వారా వాహనం స్టార్ట్ అయ్యేలా పనిచేస్తుంది. హెల్మెట్ ధరించకపోతే డివైజ్ రెడ్ సిగ్నల్ యాక్టివేట్ అయ్యి వాహనం ముందుకు కదలదు. ఫేక్ టెక్నాలజీ, సైబర్ నేరాలు, బెట్టింగ్‌లు, మహిళలపై అఘాయిత్యాలు వంటి సమయాల్లో ప్రజలను రక్షించటానికి కూడా నరేంద్ర కొత్త పరికరాలు తయారు చేస్తున్నాడు. చిన్న చిన్న బ్యాటరీల సహాయంతో జెసిబి క్రేనును రూపొందించాడు. వ్యవసాయ మోటారును మోటారు వద్దకు వెళ్లకుండా ఆన్ చేయటం, ఆఫ్ చేసేలా ఒక పరికరం తయారు చేశాడు.



క్యాంపులతో విద్యార్థుల్లో మరింత సృజన

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించటానికి నరేంద్ర ఇన్నోవేటివ్ బూట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. 5 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు ఈ ప్రోగ్రాం ద్వారా ఇన్నోవేటివ్ థింకింగ్, ప్రాజెక్టుల డిజైనింగ్ నేర్పిస్తున్నారు. గత ఆరేళ్లగా ఎస్ఆర్ఎంయు రోబోటిక్స్ బూట్ క్యాంపులను కొనసాగిస్తున్నారు. 2021లో ఎస్ఆర్ఎంయు రోబోటిక్స్ బూట్ క్యాంపు పేరుతో తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ఇలాంటి క్యాంపులకు హాజరైతే భవిష్యత్తులో వారు మంచి నిపుణులుగా మారతారనేది నరేంద్ర ఆలోచన.


\- యడవల్లి శ్రీనివాసరావు

అందరికీ ఉపయోగపడేలా...

ప్రస్తుత సమాజం మొత్తం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) విధానంలో నడుస్తోంది. రోబోటిక్స్ దీనిలో భాగమే. మనం ఏ రంగంలో ఉన్నా మరింత సృజనతో నైపుణ్యతకు రోబోటిక్స్ అవసరం ఉంది. ఈ టెక్నాలజీ నేర్చుకుంటే ఏ రంగంలోనైనా నిపుణత సాధించొచ్చు. సమాజ సేవలో భాగంగా నేను, నా స్నేహితులు కొందరం కలిసి రోబోటిక్ బూట్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. అందులో క్రియేటివిటీ థింకింగ్ స్కిల్స్, ఇన్నోవేటివ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టు డిజైనింగ్ టెక్నాలజీ వంటివి ఇంజనీరింగ్ స్థాయిలో నేర్పిస్తాం. తద్వారా 5వ తరగతిలో ప్రారంభిస్తే 10వ తరగతి వచ్చే వరకూ పూర్తి నిపుణత సాధించొచ్చు. అన్ని రంగాలు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో రోబోటిక్స్ టెక్నాలజీ ద్వారా సులభంగా పనులు పూర్తిచేసుకోవచ్చు. బోరుబావుల్లో పిల్లలు పడినప్పుడు వారిని రక్షించటానికి అవసరమైన మెకానిజంపై కొత్త పరికరాన్ని తయారు చేసే ప్రాజెక్టును కొనసాగిస్తున్నాం.

\- దాసరి నరేంద్ర,
రోబోటిక్స్ తయారీ నిపుణులు

చిన్నారి అభిమానికి శేష్ సర్‌ప్రైజ్



అడివి శేష్ ఇటీవల క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్ని పాపతో రోజంతా గడిపారు. ఇండస్ట్రీకి చెందిన ఒక సన్నిహిత వ్యక్తి ద్వారా ఈ చిన్ని అభిమాని గురించి తెలుసుకున్న శేష్, పాప కుటుంబ సభ్యులని సంప్రదించారు. వీడియో కాల్స్ ద్వారా పాపతో మాట్లాడారు. చిన్నారి మెసేజులకు రిప్లేయ్ ఇచ్చారు. తాజాగా ఆ చిన్నారికి ఒక క్యూట్ సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. ఒక హోటల్‌లో ఫ్యామిలీ కోసం డే అవుట్‌ని ప్లాన్ చేసి, అక్కడ చిన్నారిని కలిశారు. పాపతో రోజంతా సరదాగా ఆడుతూ గడిపారు. అవసరమైనప్పుడు తన సపోర్ట్ ఉంటుందని కుటుంబానికి ధైర్యం చెప్పారు. శేష్‌కి డై -హార్డ్ ఫ్యాన్ అయిన ఆ చిన్నారి తన అభిమాన హీరోని కలవాలని చాలా కాలంగా కలలుకంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న శేష్, ఆమె కలను నిజం చేయాలని నిర్ణయించుకున్నారు.

సైమాలో 'పిండం' నామినేషన్

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైద దర్శకత్వంలో రూపొందిన 'పిండం' చిత్రం ప్రతిష్టాత్మక అవార్డు వేడుక 'సైమా 2024'లో ఉత్తమ తొలి చిత్ర నిర్మాత విభాగంలో నామినేషన్ పొందింది. ఈ సినిమాతో దర్శకుడు సాయికిరణ్ దైదతో పాటు కళాహి మీడియా వ్యవస్థాపకుడు యశ్వంత్ దగ్గుమాటి నిర్మాతగా సినీ రంగ ప్రవేశం చేశారు. విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు, వాణిజ్య పరంగా మంచి విజయం సాధించింది.



గాయకుడు జయరాజ్‌కు గుండెపోటు



ప్రముఖ కవి, గాయకుడు జయరాజ్ గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఐసియులో డాక్టర్లు వైద్యసేవలు అందిస్తున్నారు. 'అడవిలో అన్న' సినిమాలోని 'వందనాలమ్మ' పాటను జయరాజ్ రాశారు. వందేమాతరం శ్రీనివాస్ ఆలపించిన ఈ పాట అప్పట్లో ఎంతోమందిని చైతన్యపర్చింది.

శాశ్వత ప్రాతిపదికన సినిమా సెట్స్ నిర్మించాలి : సుమన్



రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం షూటింగ్ స్పాట్లు, ప్రత్యేక సెట్స్‌ను నిర్మించాలని ప్రముఖ నటుడు సుమన్ కోరారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్‌లను సెక్రటేరియట్‌లో కలిసి ఈ మేరకు విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో చిన్న సినిమాల చిత్రీకరణకు మరింత స్వేచ్ఛనివ్వాలనీ, లొకేషన్ల విషయంలో నియంత్రణ లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో సినిమా చిత్రీకరణకు ఎక్కువ వ్యయం అవుతోందన్నారు. అందువల్ల నిర్మాతలంతా రాష్ట్రం వైపు చూస్తున్నారని తెలిపారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే చిన్న సినిమాల నిర్మాణం పెరగాల్సివుందన్నారు. అందువల్ల ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైల్వేస్టేషన్, బస్టాండ్, కోర్టు, పోర్టు, ఎయిర్‌పోర్టు, కాలేజ్ వంటి సెట్లను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటుచేయటం ద్వారా షూటింగ్‌కు అనుకూల వాతావరణం కల్పించొచ్చునని సూచించారు. తెలంగాణాలో కంటే ఆంధ్రాలోనే షూటింగ్‌లకు అవసరమైన లొకేషన్లు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కృషిచేస్తారనే నమ్మకం ఉందన్నారు.

తెలంగాణలో ఎవరిపైనా వివక్ష ఉండదు

కమ్మ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలో ఏ ప్రాంతం వారిపైనా వివక్షత ఉండబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న 'కమ్మ గ్లోబల్ సమ్మిట్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ కులాలక తీతంగా నగరంలో నివసించే ప్రజలందరి నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు వారికి సమానావకాశాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు.

నేలను నమ్ముకుని కష్టపడి పనిచేసి పదిమందికి సాయం చేయడం కమ్మ సామాజిక వర్గం లక్షణమని కితాబిచ్చారు. ఎన్‌టిఆర్ లైబ్రరీలో అభ్యసించిన చదువే తనను ఉన్నత స్థానంలో నిలబెట్టిందని గుర్తుచేశారు. ఆయన రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. తమకు భేషజాలు లేవనీ, తాము అన్ని కులాలను గౌరవిస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం హక్కనీ, దాన్ని నియంత్రించాలనుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో గత పాలకులు చూశారని గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని అందరూ ప్రోత్సహించాలని సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తమిళనాడు ఎంపి కళానిధి, మాజీ గవర్నర్ పిఎస్ రామ్మోహన్ రావు, పుల్లెల గోపీచంద్, మాజీ ఎంపిలు మురళీమోహన్, తానా అధ్యక్షులు నిరంజన్, ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, నిమ్మగడ్డ ప్రసాద్, జీవిత రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గెలిస్తే సెమీస్ బెర్త్

- నేడు యుఎఇతో భారత్ ఢీ
- రాత్రి 7.00గం॥లకు
- ఆసియాకప్ మహిళల క్రికెట్



దంబుల్లా: ఆసియా కప్ మహిళల క్రికెట్ టోర్నీలో భారత్ నేడు మరో పోటీకి సిద్ధమైంది. శుక్రవారం జరిగిన గ్రూప్-ఎ తొలి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. నేడు యుఏఇతో పోరుకు సిద్ధమైంది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన-షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 85పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. మరోవైపు స్పిన్నర్లు దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో నేడు యుఏఇతో జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో గెలిస్తే హర్మన్‌ప్రీత్ సేనకు సెమీస్ బెర్త్ ఖాయం కానుంది.

శ్రీలంక ఘన విజయం...

మహిళల ఆసియాకప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు ఘన విజయం సాధించింది. దంబుల్లా వేదికగా బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన గ్రూప్-బి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 111పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని శ్రీలంక జట్టు 17.1ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 114పరుగులు చేసింది. ఓపెనర్ గుణరత్నే(51) అర్ధసెంచరీకి తోడు హర్షిత(33) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను కెప్టెన్ నిగర్ సుల్తానా(48) ఆదుకుంది. శ్రీలంక బౌలర్లు ప్రబోధని, ప్రియదర్శినికి తోడు కుమారి, దిల్‌హరి, ఆటపట్టు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. బంగ్లా లోయర్ ఆర్డర్ బ్యాటర్ షోర్నా అక్తర్(25; 14బంతుల్లో 5ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గుణరత్నేకు లభించింది.

థాయ్‌లాండ్ గెలుపు

మహిళల ఆసియాకప్ క్రికెట్‌లో థాయ్‌లాండ్ జట్టు శుభారంభం చేసింది. దంబుల్లా వేదికగా జరిగిన గ్రూప్-బి తొలి లీగ్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్ జట్టు 22పరుగుల తేడాతో మలేషియాపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన థాయ్‌లాండ్ జట్టు 20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 133పరుగులు చేయగా.. ఛేదనలో మలేషియా జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 111పరుగులే చేసింది. ఈ గెలుపుతో థాయ్‌లాండ్ జట్టు గ్రూప్-బిలో 2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.


భారీ ఆధిక్యత దిశగా ఇంగ్లండ్

వెస్టిండీస్ 457ఆలౌట్

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లోనూ ఇంగ్లండ్ జట్టు భారీ ఆధిక్యత దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 416పరుగుకు పరిమితమైన ఇంగ్లండ్.. రెండో ఇన్నింగ్స్‌లో 40ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. దీంతో వెస్టిండీస్‌పై ఇప్పటికే 151 పరుగుల ఆధిక్యతను సంపాదించింది. ఆ సమయానికి డకెట్(71), పోప్(51) అర్ధసెంచరీలు చేసి ఔటైనా.. రూట్(21), బ్రూక్(31) క్రీజ్‌లో ఉన్నారు. ఒక ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 351పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ జట్టు 457పరుగులకు ఆలౌటైంది. వెస్టిండీస్ మిడిలార్డర్ ఆర్డర్ బ్యాటర్లు డి-సిల్వ(82నాటౌట్)కి తోడు జోసెఫ్(33) బ్యాటింగ్‌లో రాణించారు. 11 వికెట్‌కు వీరిద్దరూ 71పరుగులు జతచేశారు. ఇంగ్లండ్ బౌలర్లు క్రిస్ వోక్స్‌కు నాలుగు, అట్కిన్సన్, బషీర్‌కు రెండేసివికెట్లు దక్కాయి.

పోరాడినా పతకం దక్కలేదు

టోక్యో ఒలింపిక్స్‌లోనూ హాకీ అమ్మాయిలకు నిరాశే





PARIS 2024

మాస్కో ఒలింపిక్స్‌లో తొలిసారి ప్రాతినిధ్యం వహించి పతకాన్ని చేజార్చుకున్న మహిళల హాకీ జట్టుకు 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ నిరాశ తప్పలేదు. ఇక 2024 పారిస్ ఒలింపిక్స్‌కు భారత మహిళల హాకీజట్టు అర్హత సాధించ లేకపోయింది. ఇక లియాండర్ పేస్-మహేశ్ భూపతి జోడీతోపాటు మహిళా జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఆ తర్వాతి ఒలింపిక్స్‌లో పతకానికి చేరువైనా.. కైవసం చేసుకోవడంలో విఫలమయ్యారు. వీరిందరూ ప్రదర్శన చరిత్రపుటల్లో ఇప్పటికీ చిరస్థాయిలో నిలిచిపోయింది.

2004 ఏథెన్స్ ఒలింపిక్స్...

ఏథెన్స్‌లో లియాండర్ పేస్-మహేశ్ భూపతి పురుషుల డబుల్స్‌లో అంచనాలకు మించి రాణించారు. ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన ఈ జోడి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. సెమీస్‌లో టాప్ సీడ్ జర్మనీకి చెందిన రైనర్ షట్లర్-నికోలస్ కీపర్ చేతిలో 2-6 3-6తో ఓడారు. ఇక కాంస్య పతక పోటీలో మారియో-ఇవాన్(క్రొయేషియా) చేతిలో 6-7, 6-4, 14-16తో పోరాడి ఓడారు. నిర్ణయాత్మక మూడోసెట్‌లో స్టార్ ప్లేయర్స్‌కు ముచ్చెమటలు పట్టించి కోట్లాదిమంది భారతీయుల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచారు. ఇక మహిళా లిఫ్టర్ కుంజరాణిదేవి 48కిలోల విభాగంలో పతకానికి దగ్గరైంది. క్లీన్ అండ్ జెర్క్‌లో 112.5కిలోల బరువును ఎత్తడంలో విఫలమై.. మొత్తం 190కిలోల బరువును ఎత్తి 10కిలోల తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది.

2012 లండన్ ఒలింపిక్స్...

ఈ ఒలింపిక్స్‌లో షూటర్ జోయ్‌దీప్ కర్మాకర్ కాంస్య పతకానికి చేరువయ్యాడు. పురుషుల 50మీ. రైఫిల్ ఫైనల్లో జోయ్‌దీప్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 7వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. ఫైనల్లో 1.9పాయింట్ల తేడాతో తృటిలో కాంస్య పతకాన్ని కోల్పోయాడు.

2016 రియో ఒలింపిక్స్...

రియో ఒలింపిక్స్‌లో ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన మహిళా జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ 'వాల్ట్' విభాగంలో ఫైనల్‌కు చేరింది. ఒలింపిక్స్ చరిత్రలో భారత జిమ్నాస్ట్ ఒకరు ఫైనల్‌కు చేరడం ఇదే ప్రథమం. ఫైనల్లోకి అద్భుత ప్రదర్శనతో చివరి వరకు నిలిచి 15.066పాయింట్లతో 4వ స్థానానికి పరిమితమైంది. 0.150పాయింట్ల వ్యత్యాసంతో కాంస్య పతకాన్ని కోల్పోయింది. అమెరికా, రష్యాలకే జిమ్నాస్టిక్స్ పరిమితం అనుకున్న క్రీడాభిమానుల ఆలోచనలకు దీప స్వస్తి పలికింది.

2020 టోక్యో ఒలింపిక్స్...

1980 మాస్కో తర్వాత భారత మహిళల హాకీ జట్టు మరోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పూల్ రౌండ్‌లో దక్షిణాఫ్రికాపై 4-3, ఐర్లాండ్‌పై 1-0తో నెగ్గి క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్‌ఫైనల్లో ఏకంగా ఆస్ట్రేలియాపై 1-0తో నెగ్గి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో అర్జెంటీనా చేతిలో 2-1గోల్స్‌తో, కాంస్య పతక పోటీలో గ్రేట్ బ్రిటన్ చేతిలో 4-3గోల్స్ తేడాతో రాణి రాంపాల్ సారథ్యంలోని మహిళా జట్టు ఓటమితో సభ్యులంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఇక మహిళా గోల్ఫర్ అదితి అశోక్ ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. కానీ ఫైనల్లో పతకాన్ని అందుకోలేకపోయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68